


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 06 ఫిబ్రవరి 2022 సంపుటి : 03 సంచిక : 155 పేజీలు : 4 వెల : రూ 3-00


## మొదలైన ఉద్యోగుల సహాయనిరాకరణ

సమ్మెతో బోసిపోయిన కార్యాలయాలు

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసనలు




అమరావతి,ఫిబ్రవరి5): పిఆర్సి పోరులో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సహాయనిరాకరణ ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పెన్‌డౌన్, యాప్ డౌన్ చేసి ఉద్యోగులు విధులను బహిష్కరించారు. కార్యాకలాపాలు నిలిచి పోవడంతో ప్రజలు వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని.. స్టీరింగ్ కమిటీ ఆదేశాలతో కార్యాచరణ కొనసాగుతుందని ప్రకటించారు. విజయవాడలో తహసీల్దారు, పౌర సరఫరాలశాఖ, రిజిస్ట్రేషన్, రవాణా శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖల కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. వివిధ యాప్‌లను ఉపాధ్యాయులు మూసివేశారు. శనివారం ఉదయం నుండి యాప్‌లలో నమోదు కార్యక్రమం నిలిచిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉద్యోగులు పెన్‌డౌన్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారమే కంప్యూటర్లను షట్‌డౌన్ చేసి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. అదే స్ఫూర్తితో దాదాపుగా అన్నిజిల్లాల్లోనూ ఉద్యోగులు నిరసన తెలుపుతున్నారు. కలెక్టరేట్‌లలో నామమాత్రంగానే కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆర్‌టిసి ఉద్యోగులను సమ్మెకు దూరంగా ఉంచాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించడం లేదు. శనివారం ఉదయం నుండే అన్ని డిపోల్లోనూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ వంటి అత్యవసర విభాగాల్లో కూడా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు రావడం కనిపించింది. పూర్తిస్థాయిలో సమ్మెలో పాల్గొనాలని తమకు ఉందని, అయితే, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో పనిచేస్తున్నామని వారు చెబుతున్నారు. సమ్మె సన్నాహాల్లో నిమగమవుతూనే రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న చర్చలపై కూడా ఉద్యోగులు పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయనంత వరకు జరిగిన చర్చల్లో ప్రభుత్వం అనుసరించిన వైఖరిపై ఉద్యోగులో ఆసక్తికర చర్చ జరుగుతోంది. అశుతోష్ మిశ్రా కమిటీ నివేదికను బయటపెట్టడానికి ప్రభుత్వం సిద్ధం కాకపోవడం, రాతపూర్వకంగా హామీలను ఇవ్వడానికి మంత్రుల కమిటి అంగీకరించకపోవడం వంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఉపాధ్యాయులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఉద్యోగ సంఘాల నేతలు అప్రమత్తంగా వ్యవహరించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమ్మెను ఏదో రకంగా వాయిదా వేయించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందని, అన్ని డిమాండ్ల సాధనకు సంఘాలు పట్టుబట్టాలని ఉద్యోగులు అంటున్నారు. మంత్రుల కమిటీ సమావేశమై సిఎం వద్దకు వెళ్లిన నేపథ్యంలో మధ్యాహ్నం నుండి జరిగే చర్చల్లో అన్ని డిమాండ్లను పరిష్కరించేలా నేతలు వ్యవహరించాలని అంతవరకు ఇప్పటికే ప్రకటించిన కార్యక్రమంలో ఎటువంటి మినహాయింపులు ఇవ్వకూడదన్న అభిప్రాయం వీరిలో వ్యక్తమవుతోంది. మహిళా ఉద్యోగులు మరింత గట్టిగా ఈ అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు.

# సీఎం జగన్ తో ముగిసిన మంత్రుల కమిటి భేటీ



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో మంత్రుల కీలక చర్చ

తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రులు కీలక చర్చలు జరిపారు. ఉద్యోగుల సమ్మె నోటీస్ నేపథ్యంలో సమాలోచనలు జరిపారు. చర్చలకు రాకుండా సమ్మెకు వెళితే ప్రత్యామ్నాయం ఎలా అనే అంశంపై చర్చించారు. ఈ భేటీలో మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.అమరావతి సీఎం జగన్ తో మంత్రుల కమిటి భేటీ ముగిసింది. శనివారం నాడు క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్ తో సమావేశం అయ్యారు మంత్రులు బొత్స, బుగ్గన, పేర్ని నాని, ప్రభుత్వ సలహాదారు సజ్జల, సీఎస్ సమీర్ శర్మ. హెచ్‌ఆర్‌ఏ, పెన్షన్ శ్లాబుల్లో మార్పులు, రికవరీ మినహాయింపుతో పడే ఆర్థికభారంపై చర్చించారు. ఏడువేల 500 కోట్ల అదనపు భారం పడుతుందని అంచనా వేస్తున్నారు ఆర్థిక శాఖ అధికారులు. స్టీరింగ్ కమిటీ సభ్యులు కమిటీ ముందు పెట్టిన ఇతర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళారు మంత్రుల కమిటీ. నిన్న రాత్రి వరకు ఉద్యోగులతో చర్చించాం. ఉద్యోగుల్లో ఉన్న అసంతృప్తి, ఆవేదనకు పరిష్కారం చూపాం అన్నారు మంత్రి బొత్స సత్యనారాయణ.ఇప్పుడు మళ్లీ సమావేశమవుతున్నాం. అన్ని అంశాలు సీఎంకి వివరిస్తాం. హెచ్ ఆర్ ఏ గురించి ఈ రోజు చర్చిస్తాం. రికవరీ విషయంలో క్లారిటీ ఇచ్చాం. దీనివల్ల 6 వేల కోట్లు భారం ఉండొచ్చు అనుకుంటున్నాం. ఇక మిగిలిన సమస్యలు అన్నీ చిన్న చిన్న విషయాలే అన్నారు మంత్రి బొత్స.స్టీరింగ్ కమిటీ సభ్యులు తమ ముందు పెట్టిన ఇతర డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన మంత్రుల కమిటీ. సీఎం భేటీ అనంతరం సచివాలయానికి చేరుకుంది మంత్రుల కమిటీ

## భారత సైన్యం కంటే చైనాపైనే రాహుల్‌కు నమ్మకం : రాజ్‌నాథ్

చైనా, పాక్ విషయంలో పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ చేసిన వ్యాఖ్యలు ఇంకా రాజకీయ వేదికపై నానుతూనే వున్నాయి. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులతో సహా, కాంగ్రెస్ సీనియర్ నేత నట్వర్ సింగ్ రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టారు.తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ యూపీ ప్రచారంలో కూడా రాహుల్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. భారత సైనికుల పరాక్రమానికి రాహుల్ గాంధీ విలువ ఇవ్వరని, సైనికుల పరాక్రమాన్ని విశ్వసించరని తీవ్రంగా మండిపడ్డారు. చైనా మీడియానే నమ్ముతారని, చైనా మీడియాపైనే రాహుల్ ఎక్కువగా ఆధారపడతారని రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఆక్షేపించారు. భారత దేశం



ఇప్పుడు అత్యంత బలవంతమైన దేశమని, ఈ విషయం ఇప్పటికే ప్రపంచానికి తెలిసిపోయిందన్నారు. సరిహద్దులను దాటిమరీ.. శత్రువుల వీచమణచిన విషయాన్ని గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గాల్వాన్ ఘర్షణలో భారత సైనికులే చాలా మంది వీర మరణం పొందారని, చైనా వాళ్లు తక్కువ మందే చనిపోయారని పేర్కొన్నారు. రాహుల్ చైనా మీడియానే ఎక్కువగా నమ్ముతారు. 38 నుంచి 50 మంది చైనా సైనికులు గాల్వాన్ ఘర్షణలో చనిపోయారని ఆస్ట్రేలియా మీడియా పేర్కొంది. భారత ఆర్మీ పరాక్రమంపై రాహుల్‌కు విశ్వాసం లేదు అని రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా మండిపడ్డారు.యూపీలో శాంతిభద్రతల విషయంలో సీఎం యోగి సక్సెస్ అయ్యారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కితాబునిచ్చారు. క్రిమినల్స్ రాష్ట్రం విడిచి పోయేలా చేశారని, వారి ఆస్తులను కూడా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. యూపీ అభివృద్ధి పథంలో సాగుతోందని, రోడ్ల పరిస్థితి కూడా చాలా మెరుగైందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

## ప్రజల దృష్టిని మళ్లించడానికే జిల్లాకు ఎన్టీఆర్ పేరు: బాలకృష్ణ



అనంతపురం : ఎట్టి పరిస్థితుల్లోనూ హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ డిమాండ్ చేశారు. అందుకోసం తాను దేనికైనా సిద్ధమేనన్నారు. మేనిఫెస్టోలో పెట్టారు కాబట్టి జిల్లా కేంద్రంగా ప్రకటించాల్సి ఉందన్నారు. జిల్లాకు ఏ పేరు అయినా పెట్టుకోవాలని.. తమకు ఎలాంటి అభ్యంతరమూ లేదన్నారు. అధికార వైసీపీ కార్యాచరణ ఏ విధంగా ఉంటుందో దాన్ని బట్టి తమ కార్యాచరణ కూడా ఉంటుందని.. అవసరమైతే ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. జిల్లా కేంద్రం కోసం దేనికైనా సిద్ధమేనన్నారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టారన్నారు. జిల్లాల ప్రకటన తర్వాత ఎక్కడపడితే అక్కడ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. దానిపైన ఎలాంటి యాక్షన్ లేదన్నారు. ఎన్టీఆర్ అంటే అంత గౌరవం ఉంటే ఇలా చేస్తారా..? అని బాలయ్య ప్రశ్నించారు. దీనిని కేవలం పొలిటికల్ స్టంట్‌గా కొట్టిపారేశారు. కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పెట్టడం.. ఏ ప్రేమతో పెట్టారు అందరికీ తెలిసిందేనన్నారు.

## ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం

ఉద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

- మంత్రి బొత్స సత్యనారాయణ

అమరావతినిన్న ఉద్యోగులతో చర్చలు సానుకూలంగా జరిగాయి. ఈరోజు మళ్లీ ఉద్యోగ సంఘాలతో చర్చిస్తాం. సమస్యకు పరిష్కారం ఉంటుందని భావిస్తున్నామని మంత్రి బోత్స సత్యనారాయణ అన్నారు. ఈరోజుతో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి. హెచ్‌ఆర్‌ఏ శ్లాబ్ లపై కూడా చర్చించాం. ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం... ఎవరికైనా కొన్ని అభిప్రాయ భేదాలు రావొచ్చు. ఇది కూడా అలాంటిదే. సీఎం దృష్టికి నిన్నటి అంశాలను తీసుకెళ్తాం. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా, చిత్తశుద్ధితో ఉందని అన్నారు. టిడ్కో ఇళ్ళపై ఆంధ్రజ్యోతి పత్రిక తప్పుడు వార్తలు వండి వార్చుతుంది.




వాస్తవాలు తెలుసుకుని రాయాలి, సమాచారం కావాలంటే, ప్రభుత్వ అధికారులను, మంత్రిగా తననైనా వివరణ అడగి రాయాలన్న కనీస సంప్రదాయాలను కూడా పాటించకుండా ఇష్టం వచ్చినట్టు అసత్యాలతో కూడిన వార్తలను రాయడం మంచి పద్ధతి కాదు. మీకున్న ఉద్దేశాలను, దురుద్దేశాలను టిడ్కో ఇళ్ళపై రుద్ది అబద్ధపు వార్తలు రాయటం సమంజసం కాదు. టిడ్కో ఇళ్ళల్లో మూడు కేటగిరీలు ఉన్నాయి. వాటిల్లో 300 ఎస్ఎఫ్టీ, 365 ఎస్ఎఫ్టీ, 430 ఎస్ఎఫ్టీ ఇళ్ళు నిర్మిస్తున్నాం. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఈ ఇళ్ళకు సంబంధించి లబ్ధిదారులే పూర్తిగా రుణాలు చెల్లించాల్సి ఉండేది. 20 ఏళ్ళపాటు అసలు వడ్డీలతో సహా కట్టాల్సి వచ్చేది. అప్పు తీరిన తర్వాతే ఆ ఇంటిపై వారికి సర్వ హక్కులు వచ్చేవి. జగన్ మోహన్ రెడ్డిగారు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు... మా ప్రభుత్వం వచ్చిన తర్వాత 300 ఎస్ఎఫ్టీ ఇళ్ళను.. ఒక్క రూపాయి కట్టించుకుని పేదలకు రిజిస్ట్రేషన్ చేసి, పూర్తి హక్కులతో ఇస్తున్నాం. టిడ్కో ఇళ్ళు మొత్తం 2. 62 లక్షలు ఉంటే.. వాటిల్లో 300 చ. అడుగుల ఇళ్ళు 1.43 లక్షల ఇళ్ళను ఉచితంగా ఇచ్చి, వారిని సొంత ఇంటిదారులను చేస్తున్నాం. వారికి, ఏ అప్పు లేకుండా వెంటనే సర్వ హక్కులతో ఇల్లు సొంతమవుతుంది. మిగిలిన రెండు కేటగిరీలకు సంబంధించిన ఇళ్ళకు, లబ్ధిదారుని పేరిట ఇచ్చే బ్యాంకు రుణాలకు ప్రభుత్వం ఫెసిలిటేటర్ గా ఉంటుంది. పథకం ఇంతా పక్కాగా, పేదలకు న్యాయం జరిగేలా అమలు చేస్తుంటే... లబ్ధిదారుల పేరిట రుణాలు అంటూ.. ఆంధ్రజ్యోతి తప్పుడు సమాచారంతో రాతలు రాయడాన్ని ఖండిస్తున్నాం. ప్రజల్లో అపోహలు సృష్టించి, ఎవరికో రాజకీయ ప్రయోజనం కల్పించడానికి ఈ తరహా వార్తలు రాయడంభావ్యం కాదు. లేనిపోని అపోహలు సృష్టించి.. లబ్ధిదారులను ఆందోళనకు గురి చేయవద్దు అని ఆంధ్రజ్యోతి యాజమాన్యాని చెబుతున్నాం. మీ విలువ కాపాడుకోవాలని హితవు చెబుతున్నాయని అయన అన్నారు.

## ఉద్యోగులపై చర్యలు తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని హైకోర్టు

అమరావతి ఫిబ్రవరి 5 పీఆర్సీ వివాదంపై విచారణ సందర్భంగా హైకోర్టు చేసిన వ్యాఖ్యలతో ఇవే అనుమానాలు పెరిగిపోతున్నాయి. ఉద్యోగుల సమ్మె చట్ట విరుద్ధమని సమ్మెను విరమింప చేయాలంటు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్ పై విచారణ సందర్భంగా కోర్టు కొన్ని కీలకమైన వ్యాఖ్యలు చేసింది. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలను నియంత్రించాల్సిన బాధ్యత



ప్రభుత్వంపైనే ఉంటుందన్నది. ఇంత పెద్ద ఎత్తున ఉద్యోగులు నిర్వహించిన ఛలో విజయవాడ కార్యక్రమంతో కోవిడ్ పెరిగిపోతుందని ఉద్యోగులకు తెలియదా అంటు నిలదీసింది.కోవిడ్ నిబంధనలు పాటించకుండా రాష్ట్రాన్ని ఉద్యోగులు ప్రమాదంలోకి నెట్టేస్తున్నట్లు కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వాన్నే సవాలు చేస్తున్న ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వం నిర్ణయమని కోర్టు తేల్చి చెప్పేసింది. పరిస్థితులకు తగ్గట్టుగా ఉద్యోగులపై చర్యలు తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని కోర్టు స్పష్టంగా చెప్పింది. ఉద్యోగులను ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించుకునేందుకు ప్రభుత్వం ఎలా అనుమతించిందని కోర్టు ప్రశ్నించింది.కోవిడ్ ను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో ఛలో విజయవాడ లాంటి కార్యక్రమాలను నియంత్రించాలంటు ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఉద్యోగుల వాదనలు కూడా విన్న తర్వాత సమ్మె విషయంలో తగిన ఆదేశాలు ఇస్తామని కోర్టు చెప్పింది. ఉద్యోగుల సమ్మె విషయంలో శనివారం కోర్టు తగిన ఆదేశాలిస్తుందని అనుకుంటున్నారు. కోర్టు చేసిన వ్యాఖ్యలు చూసిన తర్వాత ఉద్యోగులు ఉపాధ్యాయులపై కఠినమైన చర్యలు తీసుకోమని ప్రభుత్వానికి స్వేచ్ఛ ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు అనిపిస్తోంది. ఇలాంటి ఆదేశాలే గనుక వస్తే అప్పుడు ఉద్యోగులపై ప్రభుత్వం చర్యలకు దిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.విద్యుత్ ఆర్టీసీ లాంటి కీలకమైన శాఖల ఉద్యోగులు కూడా సమ్మెలోకి దిగితే అప్పుడు ఎసెన్షియల్ సర్వీసెస్ మైన్ టెన్స్ యాక్ట్ (ఎస్మా) ప్రయోగించే అవకాశముంది. ఇదే జరిగితే ఉద్యోగులు తీవ్రంగా నష్టపోక తప్పదు. ఒకపుడు తమిళనాడులో ఉద్యోగులు ఇలాగే సమ్మె చేస్తే అప్పటి సీఎం జయలలిత అందరినీ ఎస్మా చట్టంతో ఉద్యోగాల్లో నుండి తీసేసింది. కోర్టు కూడా జోక్యం చేసుకోలేదు. చివరకు ఉద్యోగులు బతిమలాడుకుంటే అప్పుడు ఇండివిద్యుల్ గా అఫిడవిట్లు తీసుకుని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నది.

## ఉద్యోగుల ఇష్యూకు ముగింపు పలుకుతాం: మంత్రి పేర్నినాని

అమరావతి: నేటితో ఉద్యోగుల సమస్య పరిష్కారం అవుతుందని మంత్రి పేర్నినాని అన్నారు. నిన్న ఉద్యోగుల డిమాండ్స్‌పై చర్చించామని, పీఆర్సీ అంశంపై ఉద్యోగుల అసంతృప్తిని సరిదిద్దేందుకు మంత్రుల కమిటీ ప్రయత్నం చేసిందని తెలిపారు. అనుమానాల



నివృత్తితో పాటు కొన్ని సర్దుబాటు చేశామన్నారు. చాలా అంశాల్లో ఉద్యోగ సంఘాలు అంగీకారానికి వచ్చాయని భావిస్తున్నామని తెలిపారు. మళ్ళీ కలిసి పని చేస్తామని చెప్పారు. ఫిట్మెంట్, ఐఆర్ రికవరీ, హెచ్‌ఆర్‌ఏ అంశాలతో పాటు చాలా అంశాలు మాట్లాడామన్నారు. ఇవాళ మరోమారు చర్చలు జరిపి ఇష్యూకి ముగింపు పలుకుతామని మంత్రి పేర్నినాని స్పష్టం చేశారు.

## అపోలో చైర్మన్ ప్రతాప్ సి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం జగన్

అమరావతి: అపోలో ఆస్పత్రుల వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ప్రతాప్ సి. రెడ్డికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 'వైద్యరంగంలో ఆధునిక భారత ఆరోగ్య సంరక్షణ రూపశిల్పిగా పరిగణించబడుతున్న ప్రతాప్ సి. రెడ్డికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఎల్లప్పుడూ ఆయన సంతోషంగా జీవించాలని కోరుకుంటున్నట్లు' పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్ శనివారం ట్వీట్ చేశారు.



# సంపాదకీయం

ఆదివారం 06 ఫిబ్రవరి 2022

## మహారాజా ముందు సవాళ్లు

సరిగ్గా ఏడు దశాబ్దాల తర్వాత మహారాజా సొంత గూటికి చేరారు. 1932లో జేఆర్డీ టాటా పూనికతో 'టాటా ఎయిర్‌లైన్స్'గా ఆరంభమై, జాతీయీకరణతో 1953లో ప్రభుత్వం చేతికొచ్చి, మహారాజా చిహ్నంతో పాపులరైన భారత విమానయాన సంస్థ ఎయిరిండియా ఇప్పుడు మళ్ళీ టాటాల చేతికే వచ్చింది. ప్రభుత్వం అధికారిక అప్పగింతలతో కొత్త శకం ఆరంభమైంది. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన విక్రయంలో దాదాపు రూ. 18 వేల కోట్లకు టాటా సంస్థ తన బిడ్డను మళ్ళీ చేజిక్కించుకుంది. దాంతో పాటు సంస్థ తాలూకు రూ. 15,300 కోట్ల మేర ఋణభారాన్ని భుజానికెత్తుకుంది. రోజుకు రూ. 20 కోట్ల మేర నష్టపోతున్న ఈ సంస్థను మళ్ళీ గగనతలంలో దూసుకుపోయేలా చేయడం ఇప్పుడుటాటాల ముందున్న పెనుసవాలు. అటు ఎయిరిండియా, ఇటు దేశ విమానయాన రంగం, వివిధ రంగాలు ? వ్యాపారాల్లో ప్రభుత్వ పాత్ర... అన్నిటా ఇది ఓ కీలక ఘట్టం.మోదీ గద్దెనెక్కిన తరువాత గడచిన ఎనిమిదేళ్ళలో విజయవంతంగా పూర్తయిన తొలి ప్రైవేటీకరణ ప్రయత్నం ఇదే. కానీ, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా కలిసొచ్చిందేమీ లేదు. పేరుకు రూ. 18 వేల కోట్లకు కొన్నా, అందులో రూ. 2,700 కోట్లే ప్రభుత్వానికి ఇచ్చేది. మిగతా రూ. 15,300 కోట్లు ప్రభుత్వమిచ్చిన అప్పుగా టాటా దగ్గరే ఉంటుంది. ప్రభుత్వ ప్రైవేటీకరణ సాగుతున్న తీరుపై విమర్శలూ అనేకం. ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ద్వారా రూ. 1.75 లక్షల కోట్లు గడించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ, ఇప్పటి దాకా కేవలం రూ. 9,330 కోట్లే వచ్చినట్టు సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వ 'పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం' (దీపమ్) వారి లెక్క. అవన్నీ అటుంచితే, ఈ విక్రయం ద్వారా వెలువడ్డ సిగ్నల్స్‌ను మర్చిపోలేం. నిజానికి, ఎయిరిండియా ప్రైవేటీకరణ చాలాకాలంగా వినపడుతున్నదే. ఒకప్పుడు ఉజ్జ్వలంగా వెలిగిన సంస్థ ఇది. 1932 అక్టోబర్‌లో మొదలై, టాటాలు నడుపుతున్న సంస్థలో స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం ప్రవేశించింది. మొదట 49 శాతం వాటా తీసుకుంది. 1953లో మిగతా వాటాను కూడా కొని, జాతీయీకరణ జరిపింది. తర్వాత కొన్ని దశాబ్దాలు ఎయిరిండియాదే హవా. ఆర్థిక సరళీకరణ, ఆ పైన పెరిగిన ప్రైవేట్ సంస్థల పోటీతో గత ప్రాభవం కోల్పోతూ వచ్చింది. ఈ ప్రభుత్వరంగ సంస్థ నిర్వహణలో అనేక లోటుపాట్లూ చోటుచేసుకున్నాయి. నష్టాలను తగ్గించుకోవడం కోసం 2007లో అంతర్జాతీయ విమానాలు నడిపే ఎయిరిండియాను, దేశీయ విమానయాన 'ఇండియన్ ఎయిర్‌లైన్స్'లో కలిపారు. అయినా సరే, అప్పటి నుంచి ఇప్పటి దాకా లాభమన్నది కళ్ళజూడలేదు. చివరకు అన్నీ కలిసి సంస్థను ప్రైవేటీకరణ బాట పట్టించాయి. వాజ్‌పేయి సారథ్యంలో 2001లోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రైవేటీకరణకు తొలి ప్రయత్నం చేసింది. 40 శాతం వాటాలు విక్రయించాలనుకొని విఫలమైంది. మోదీ సర్కార్ మొదటి విడత పాలనలో 2018లో 76 శాతం మేర వాటా అమ్మాలనుకుంది. ఒక్కరైనా ముందుకు రాలేదు. 2020 జనవరిలో పాక్షికంగా కాక వాటాలను పూర్తిగా అమ్మేస్తామంటూ, తాజా ప్రయత్నం ప్రారంభించింది. ప్రభుత్వ వాటాలుంటే దాని పెత్తనమూ ఉంటుందనీ, స్వేచ్ఛగా సంస్థ నిర్వహణ సాధ్యం కాదనీ ఇంతకాలం సంశయిస్తూ వచ్చిన ప్రైవేట్ సంస్థలకు ఇది నచ్చింది. ఎట్టకేలకు ఇప్పటికి అమ్మకం పూర్తయింది. ఇప్పటికే అనేక సంస్థలు పోటీపడుతూ, కరోనా కష్టాలతో మథనం తప్పనిసరి అయిన వేళ ఎయిరిండియాను టాటాలు చేపట్టడం గమనార్హం. తాము పురుడు పోసిన సంస్థను మళ్ళీ తమ చేతుల్లోకి తీసుకోవడం భావోద్వేగభరిత ఘట్టమే అయినా, అందులోని సవాళ్ళు అనేకం. ఒకపక్కన పాతబడుతున్న విమానాలు, మరోపక్క వేల సంఖ్యలో ఉద్యోగులు వారసత్వంగా సంక్రమించాయి. కనీసం ఏడాది పాటు ఉద్యోగులెవరినీ తొలగించబోమని హామీ ఇచ్చిన టాటాలు నష్టాల్లో ఉన్న సంస్థను ఓ గాడిన పెట్టాలంటే అసాధారణ కృషి అవసరం. విమానయాన రంగంలో ఇప్పటికే ఒకటికి రెండు సంస్థల్లో టాటాల పెట్టుబడులున్నాయి. దేశంలో ఇప్పుడు మిగిలిన ఏకైక ఫుల్ సర్వీస్ ఎయిర్‌లైన్ 'విస్తారా'లో, అలాగే తక్కువ ఖర్చుతో ప్రయాణాలకు తోడ్పడే విమానయాన సంస్థ 'ఎయిర్ ఏషియా' భారతీయ శాఖ (ఎయిర్ ఏషియా ఇండియా)లో టాటాలకు భాగముంది. ఇప్పుడు ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లలో నూటికి నూరుపాళ్ళ యాజమాన్యం, క్షేత్రస్థాయి నిర్వహణ సంస్థ 'ఎయిరిండియా ? శాట్స్'లో 50 శాతం వాటా వచ్చింది. ఒకే గొడుగు కింది విస్తారా, ఎయిర్ ఏషియా ఇండియా, ఎయిరిండియాలు మూడూ పోటాపోటీ పడాల్సిన గమ్మత్తైన పరిస్థితి. అందుకే, ఏదో ఒక దశలో వీటన్నిటినీ ఒక్కటి చేసినా, ఆశ్చర్యం లేదు. ఏమైనా, ప్రైవేటీకరణతో గూటిలోని గువ్వ పిల్లకు కొత్త రెక్కలొస్తాయా? ఈ కరోనా కాలంలో ఎయిరిండియాకు టాటా ఎలాంటి బూస్టర్ షాట్ ఇస్తుంది? జవాబుల కోసం ఇంకొంతకాలం వేచి చూడాలి. ప్రభుత్వమేమో ప్రైవేటీకరణ లక్ష్యంలో భాగంగా ఖజానాకు మరింత సొమ్ము సమకూర్చు కోవడానికి మార్చి ఆఖరున 'భారత జీవిత బీమా సంస్థ' (ఎల్ఐసీ) పబ్లిక్ ఇష్యూ గడువు పూర్తయ్యే దాకా ఆగకతప్పదు. అభ్యంతరాలు, అడ్డంకుల మధ్యనే భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ముందుకు సాగే సూచనలూ కనిపిస్తు న్నాయి. అనివార్యతలెలా ఉన్నా, ప్రజా ప్రయోజనాల్ని కాపాడాల్సిన ప్రభుత్వ సారథ్యంలోని స్వేచ్ఛా విహంగాలు ప్రైవేటు చేతిలో పతంగులుగా మారిపోవడానికి దారి తీసిన పరిస్థితులే తీరని దుఃఖం!

## ఎస్మా ప్రయోగానికి ఏర్పాట్లు చేసుకుంటున్న ప్రభుత్వం?

విజయవాడ, ఫిబ్రవరి 5, ఓవైపు చర్చలకు ఎప్పుడైనా సిద్ధం అంటూనే.. ఉద్యోగులు సమ్మెకు వెళ్లే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తుండడంతో.. కఠిన చర్యలకు అయినా వెనుకాడేది లేదనే యోచనలో ప్రభుత్వం ఉంది.. రాష్ట్రంలో ఎస్మా ప్రయోగించటానికి ఉన్న అవకాశాలపై ఏపీ సర్కార్ కసరత్తు చేస్తోంది.. ఉద్యోగులు సమ్మెకు వెళ్తే ఏం చేద్దాం.. ఎలాంటి చర్యలు తీసుకుందాం..? ప?రత్యామ్నాయ ఏర్పాట్లు ఏంటి? తదితర అంశాలపై సీఎం వైఎస్ జగన్ కీలక సమావేశం నిర్వహిస్తున్నారు.. మంత్రులు బుగ్గన, బొత్స, సలహాదారు సజ్జలతో ఈ సమావేశం రెండు గంటలకు పైగా కొనసాగుతుండగా.. క్యాంపు కార్యాలయం నుంచి సచివాలయానికి బయల్దేరి వెళ్లిపోయారు సీఎస్ సమీర్ శర్మ.మరోవైపు.. సమ్మె నేపథ్యంలో.. జిల్లా కలెక్టర్లతో వర్చువల్ గా సమావేశం కానున్నారు సీఎస్ సమీర్ శర్మ.. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు.. అత్యవసర సేవల నిర్వహణా చట్టం 1971 ప్రకారం ఎస్మా ప్రయోగించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.. వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, శానిటేషన్ స్టాఫ్, ప్రజా రవాణా, విద్యుత్, నీళ్ల సప్లయ్, అంబులెన్స్ సర్వీసులు, మందుల తయారీ, రవాణా, ఆహార రంగం, బయో మెడికల్ వ్యార్థాల నిర్వహణ వంటి సేవల అంశాల్లో ఎస్మా ప్రయోగించే అవకాశం కనిపిస్తోంది.. ఈ మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.. మరోవైపు సీపీఎస్ రద్దు, హెచ్‌ఆర్ఏ జీవోల్లో సవరణ అంశం పై సీఎం వైఎస్ జగన్ కసరత్తు చేశారు75 డిమాండ్ల సాధ్యమా....పీఆర్సీ ఉద్యమం ఉధృతమైంది.. సమ్మెకు సిద్ధం అవుతున్నారు ఉద్యోగులు.. ఇప్పటికే పెన్ డౌన్ అంటూ.. ఆందోళనను ఉధృతం చేశారు.. అయితే, ఉద్యోగ సంఘాల నేతల తీరుపై సీరియస్ గా స్పందించారు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి.. మాటలు, వాటికి కౌంటర్లు చేస్తూ వెళితే అసలు సమస్య డైవర్ట్ అవుతుందని.. దీని వల్ల ఉద్యోగులకే నష్టం అన్నారు.. ఉద్యోగ సంఘాల నాయకులు ఏం చేయాలనుకుంటున్నారో నాకు అర్థం కావడం లేదన్న ఆయన.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంటుందన్నారు.. ఆ మేరకు చర్యలు తీసుకోక తప్పదన్నారు.. అయితే, ఇప్పటికీ చర్చలకు ఓపెన్ ఆహ్వానం ఉందన్న సజ్జల.. ప్రతి రోజు పిలవటం ఉండదు కదా? వాళ్లు మేం చర్చలకు వస్తాం అంటే వెళ్లటానికి మేం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ఉద్యోగులు ప్రభుత్వంలో భాగం.. వాళ్ల పై వాళ్లే ఒత్తిడి చేసుకోవటం సరికాదన్నారు. ఇక, బయటి రాజకీయ పార్టీలు వస్తే పరిస్థితి చేయి దాటిపోతుంది? అప్పుడు ఉద్యోగులది ప్రేక్షకపాత్ర అవుతుందన్నారు సజ్జల.. రాజకీయ, అసాంఘిక శక్తులు కూడా చలో విజయవాడలో పాల్గొన్నాయన్న ఆయన.. వామపక్షాలు పాత్ర ఉందని నిన్న జెండాల ద్వారానే అర్థం అవుతుందన్నారు. ఆరోగ్య శాఖలో ఎమర్జెన్సీ సర్వీసులు ఆపితే? దానికి పరిణామాలు కూడా వాళ్లు చూడాల్సి ఉంటుందని హెచ్చరించిన సజ్జల.. నోటీసు ఇచ్చాం కనుక ప్రభుత్వం ఏం చేయకుండా చేతులు కట్టుకుని కూర్చోవాలి అంటే ఎలా సాధ్యం అవుతుంది? అని మండిపడ్డారు.. పరిస్థితిని వాళ్ళకు వాళ్లే చెడగొట్టుకుంటున్నారు.. రాజకీయ కారణాలు ముందుకు తోసుకుని వస్తున్నాయనిపిస్తోందని అనుమానాన్ని వ్యక్తం చేశారు.. సాధారణ ప్రభుత్వ సేవలు యథాతథంగా కొనసాగటానికి ఏం చేయాలో ప్రభుత్వం అన్నీ చేస్తుంది.. అంశాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయదు కదా? అని ఎదురుప్రశ్నించారు.. ఉద్యోగులు వాళ్లకు కావాల్సిన సమస్యలు ప్రాధాన్యత వారీగా ఎందుకు లిస్ట్ చేయటం లేదో అర్థం కావటం లేదు? అని ఆవేదన వ్యక్తం చేశారు సజ్జల.. సమాన పనికి సమాన వేతనం నుంచి 75 డిమాండ్లను ఒకేసారి పూర్తి చేయాలంటే ఎలా సాధ్యం అవుతుంది? అని నిలదీశారు.. పీఆర్సీకి సంబంధించి మూడు నాలుగు డిమాండ్ల పై చర్చలు చేస్తే పరిష్కారం అవటానికి అవకాశం ఉంటుందని.. ఓపెన్ మైండ్ తో మంత్రులు రావటం లేదని స్టీరింగ్ కమిటీ నేతలు చెప్పటం తప్పే అన్నారు.

## జగన్... నెక్ట్స్ ఏంటీ

విజయవాడ, ఫిబ్రవరి 5,ఏకపక్షంగా కొత్త పీఆర్సీని ప్రకటించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చెప్పిన అభ్యంతరాలను పెడచెవిన పెట్టింది. చర్చల పేరిట ఎటూ తేల్చకుండా కాలయాపన కూడా చేసింది. ఆపై ఉద్యోగులపై బెదిరింపులకు దిగింది. ఉద్యమించిన ఉద్యోగులపై ఆంక్షలు పెట్టింది. అయినప్పటికీ తమ సమస్యను ఏమాత్రం పట్టించుకోని సర్కార్ పై పీఆర్సీ సాధన సమితి ఇచ్చిన 'ఛలో విజయవాడ' పిలుపుతో ఉద్యోగులంతా దండు కట్టారు. విజయవాడ వీధుల్లో కదం తొక్కారు. లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది బెజవాడను ముట్టడించడంతో జగన్ రెడ్డి సర్కార్ కు దిమ్మ దిరిగి మైండ్ బ్లాంక్ అయింది. చీమలదండు మాదిరి ముంచెత్తిన ఆందోళనకారులను చూసిన సర్కార్ కు చలి జ్వరం వచ్చినట్లయింది. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగినట్లు కనిపిస్తోంది.పీఆర్సీ సాధన సమితి ఉద్యమంలో గణనీయమైన పాత్ర వహించిన ఉపాధ్యాయులను మచ్చిక చేసుకునే చర్యలు చేపట్టింది. ఉద్యమం నుంచి ఉపాధ్యాయులను తప్పించే వ్యూహం పన్నింది. ఈ క్రమంలో ఏపీలోని స్పెషల్ గ్రేడ్ టీచర్ల (ఎస్ జీటీ)కు పదోన్నతి వల వేసింది. ఈ ఏడాది జూన్ 30 నాటికి ఎస్ జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)గా పదోన్నతి కల్పించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ఏపీలోని సుమారు 30 వేల మంది ఎస్ జీటీలకు ప్రయోజనం కలుగుతుందని జగన్ సర్కార్ పేర్కొంది. పాఠశాల విద్యపై సమీక్షలో సీఎం జగన్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. తద్వారా పీఆర్సీ కోసం భారీ సంఖ్యలో ఉద్యమిస్తున్న ఉపాధ్యాయుల బలాన్ని తగ్గించే వ్యూహాన్ని జగన్ రెడ్డి సర్కార్ పన్నినట్లయిందని విశ్లేషకులు అంటున్నారు. ఛలో విజయవాడ సక్సెస్ అవడంతో ఆగమేఘాల మీద సీఎం జగన్ తో చర్చలు జరిపిన అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు కూడా ప్రభుత్వంలో ఏదో భయం మొదలైనట్లు కనిపించిందంటున్నారు. అంతకు ముందు ప్రభుత్వం తరఫున ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపేందుకు వేసిన కమిటీ ఏమాత్రం పట్టు విడుపు లేకుండా వ్యవహరించింది. ఛలో విజయవాడను పీఆర్సీ సాధన సమితి సక్సెస్ చేసి, ఛాలెంజ్ చేయడంతో ప్రభుత్వం బెట్టు సడలినట్లు ఉందంటున్నారు. కొత్త పీఆర్సీతో జీతాలు పెరుగుతాయంటూ చర్చల కమిటీ సుద్దులు చెప్పింది. అయితే.. సీఎస్ నిర్వహించిన ప్రెస్ మీట్ లో జీతాలు ఎక్కడ తగ్గుతాయో చెప్పాలని కోరడాన్ని 'తగ్గేదేలే' అని కాకుండా 'తగ్గితే పోలా' అనే ధోరణే కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తమకు జీతాలు తగ్గుతాయి మొర్రో.. కొత్త పీఆర్సీ వద్దు, పాత పీఆర్సీ ప్రకారమే జీతాలు ఇవ్వండని డైరెక్ట్ గానే మొత్తుకున్నా పట్టించుకోలేదు సర్కార్. పైగా ఉద్యోగుల జీతాలు ఫస్ట్ తారీఖున కాకుండా ఆలస్యంగా ఇచ్చిన జగన్ రెడ్డి సర్కార్ పంతానికి పోయి.. ట్రెజరీ ఉద్యోగులు సహకరించకపోయినా.. కొత్త పీఆర్సీ ప్రకారం జనవరి జీతాలు ఫిబ్రవరి ఒకటో తేదీనే జమ చేసింది. అయితే.. ఇంతగా తమకు జీతాలు తగ్గుతాయని చెప్పినా పట్టించుకోకుండా.. ఏదైనా సమస్య ఉంటే చెబితేనే కదా తెలిసేది అని సీఎస్ అనడంతో ప్రభుత్వంలో బింకం సడలిందా? అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. పీఆర్సీ సాధన సమితి నేతలు చేసిన డిమాండ్లను ససేమిరా అన్న సర్కార్ ఇప్పుడు హెచ్‌ఆర్ఏపై సమస్యలుంటే ప్రభుత్వంతో మాట్లాడాలని కోరడం వెనుక.. ఉద్యోగులతో పెట్టుకోవడం ఎందుకొచ్చిన తంటారా బాబూ అనే ధోరణి వచ్చిందంటున్నారు. తమ డిమాండ్లపై జగన్ రెడ్డి సర్కార్ దిగి రాకపోతే ఉద్యోగులు ఎలాగూ సమ్మెలోకి వెళ్లిపోతారు. పీఆర్సీ సాధన సమితికి ఇప్పటికే ట్రెజరీ ఉద్యోగులు మద్దతు ప్రకటించారు. ఆర్టీసీ సంఘాలు కూడా అదే బాటలో వెళ్లేందుకు సమాయత్తం అవుతున్నారు. ఆపైన వైద్య సిబ్బంది కూడా జగన్ రెడ్డి సర్కార్ పై తిరుగుబాటు బావుటా ఎగరేసేందుకు రెడీ అవుతున్నారు. కొత్త పీఆర్సీ ప్రకారం తక్కువ వచ్చిన జనవరి నెల జీతాలు చూసుకున్న పోలీసన్నలకూ జగన్ రెడ్డి సర్కార్ తత్వం బోధపడింది. ఆ కారణంగా పోలీసులు కూడా ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారంటున్నారు. పోలీసులు కోపంగా ఉండడం కూడా గురువారం నాటి 'ఛలో విజయవాడ' విజయవంతం కావడానికి ఓ కారణం అనే విశ్లేషణలు వస్తున్నాయి.

## తిరుగుబాటు ప్రారంభమైందా..

విజయవాడ, ఫిబ్రవరి 5, ఆకాశం బద్దలైందా?? నేల ఈనిందా..? అనే మాటలే గుర్తుకొస్తున్నాయి ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల 'ఛలో విజయవాడ ర్యాలీ' చూస్తుంటే.. అది జన ప్రభంజనం.. చలిచీమల మాదిరి ప్రభుత్వ ఉద్యోగులు ఛలో విజయవాడకు దండు కట్టారు. జగన్ సర్కార్ కు ముచ్చెమటలు పట్టించారు. సర్కార్ కు దిమ్మదిరిగేలా ఛలో విజయవాడతో సత్తా చాటారు. రోడ్ల మీదకు ఎవరొస్తారో.. ఎలా వస్తారో చూద్దాం అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన ప్రభుత్వ పెద్దల కాళ్ల కింద భూమి కంపించిపోయేలా కదం తొక్కారు. ఛలో విజయవాడ కార్యక్రమం జగన్ సర్కర్ కు కచ్చితంగా ఓ హెచ్చరికే అని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. కొండ చిలువ లాంటి జగన్ రెడ్డి సర్కార్ పై చలిచీమల్లాంటి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏకమై చేసిన వార్నింగ్ ఇది అంటున్నారు. రెండున్నరేళ్లుగా వైసీపీ సర్కార్ పై గూడుకట్టుకున్న ఆవేదన, కసితో తిరుగుబాటుకు నాంది పలికారంటున్నారు. జగన్ రెడ్డి సర్కార్ పై విజయవాడలో సమరశంఖం పూరించారంటున్నారు. ఇది ఒక్క ఉద్యోగుల్లోని ఆగ్రహమే కాదు.. రాష్ట్రంలోని ప్రజలందరిలో నెలకొన్న ఆగ్రహావేశాలకు నిదర్శనంగా భావిస్తున్నారు.పాలకులు ధర్మం తప్పితే.. ప్రజల అభీష్టం ప్రకారం నిర్ణయాలు చేయకపోతే ఎలాంటి పరిణామాలు చవిచూడాల్సి వస్తుందో చెప్పేందుకు ఛలో విజయవాడ ఒక ట్రైలర్ మాత్రమే అని.. అసలు సినిమా ఇక ముందు ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. అత్యధిక మంది ఎమ్మెల్యేల బలంతో విర్రవీగుతూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ పోతే.. పరిణామాలు ఇలాగే తీవ్రంగా ఉంటాయనేది ఛలో విజయవాడ నిరూపించిందని చెబుతున్నారు.నిజానికి 'ఛలో విజయవాడ'కు వచ్చిన వారంతా స్వచ్ఛందంగా తరలి వచ్చినవారే. పీఆర్సీ పేరుతో జగన్ సర్కార్ పెట్టిన చిచ్చుతో చిర్రెత్తి, కడుపు మండి వచ్చినవారే. వారికి ఎవరూ బిర్యానీ ప్యాకెట్లు, బీర్లు సప్లై చేయలేదు. బస్సులు పెట్టి తరలించనూ లేదు. పోలీసులు అడ్డుకున్నా ఆగలేదు. ప్రభుత్వ పెద్దల బెదిరింపులకూ లొంగలేదు. కొద్ది మంది వస్తే.. పోలీసులు అడ్డుకునే వారేమో.. కానీ ఉప్పెన మాదిరి ఉరకలెత్తి, వెల్లువలా ఆందోళనకారులు వస్తే.. వారిని ఆపడం ఎవరితరం? ఈ సంఘం అని తేడా లేదు.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆగలేదు.. చివరికి పోలీసులు కూడా 'ఛలో విజయవాడ' తమ వంతు పాత్ర పోషించారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చాలా చోట్ల తనిఖీలు, చెక్ పోస్టులు పెట్టినా.. నిర్బంధాలు, అరెస్టులు చేసినా.. చాలా చోట్ల పోలీసులు ఉదాసీనంగా కనిపించారంటున్నారు. తమ తరఫున కూడా మీరే ఉద్యమం చేయండని పోలీసులు సహాయ సహకారాలు అందించినట్లు సమాచారం ఉంది. ఏదో చేశామన్న పేరుతో ఒకరిద్దర్ని అదుపులోకి తీసుకున్నా పది మందిని వదిలేశారంటున్నారు. పోలీసుల ఉదాసీనత కూడా ఛలో విజయవాడ సక్సెస్ వెనుక కారణం అని రాజకీయ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. జనం ఆగ్రహిస్తే.. ఎలాంటి పరిణామాలు ఉంటాయో? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. బ్లూ మీడియాలో కాకుండా విజయవాడలో ఏం జరిగిందో మిగతా మీడియాల్లో చూస్తే అద్వైతం బోధపడుతుందని రాజకీయ విశ్లేషకులు సలహా ఇస్తున్నారు. ఉద్యోగుల నెత్తిన జగన్ సర్కార్ రుద్దిన పీఆర్సీ పుణ్యంతో వారంతా రోడ్డెక్కారు. జీతంలో కోతతో తిరగబడ్డారు. వారి కడుపుమంటను తాడేపల్లి ప్యాలెస్ ను కాల్చేసేలా ఛలో విజయవాడకు తరలివచ్చారనే నిజాన్ని ఒప్పుకుంటారా? ఇప్పటికీ మించిపోయింది లేదు.. పీఆర్సీ జీఓలు వెనక్కి తీసుకోండి.. ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చండి.. ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ బాగుపడిన దాఖలాలు చరిత్రలో లేవని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇన్నాళ్లూ సామాన్య జనాన్ని చేసినట్లు తిమ్మిని బమ్మిని చేసినట్లు ఉద్యోగ, ఉపాధ్యాయులనూ మభ్య పెట్టాలని చూస్తూ పరిణామాలు ఇలాగే ఉంటాయంటున్నారు. పోరాటంలో ఉన్న టీచర్లు విద్యార్థులకు పాఠాలతో పాటు గుణపాఠాలూ చెబుతారని గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. ఉద్యోగులకు లెక్కలు తెలుసు.. ఎవరి లెక్కలు ఎలా తేల్చాలో కూడా వారికి బాగా తెలుసని గుర్తుచేస్తున్నారు.

## చిన్న తరహా ప్రాజెక్టులతో పంటలు కళకళ

విజయవాడ, ఫిబ్రవరి 5, రాష్ట్రంలో మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల ఆయకట్టు పంటలతో కళకళలాడుతోంది. ఖరీఫ్ కోతలు పూర్తయినా ప్రాజెక్టుల్లో నీటి నిల్వ గరిష్ట స్థాయిలో ఉంది. దీంతో రబీ పంటలకు ప్రభుత్వం నీటిని విడుదల చేస్తోంది. సమృద్ధిగా నీరు వస్తుండటంతో రైతులు భారీ ఎత్తున పంటలు సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో 104.61 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం ఉంది.భారీ ప్రాజెక్టుల కింద 65.62 లక్షల ఎకరాలు, ఏపీఎస్ఐడీసీ పరిధిలోని ఎత్తిపోతల కింద 7.86 లక్షల ఎకరాలు ఉండగా, చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువుల కింద 31.13 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. రాష్ట్రంలో ఎన్నడూ లేని రీతిలో విస్తారంగా వర్షాలు కురవడంతో గోదావరి, కృష్ణా, పెన్నా, నాగావళి, వంశధార, ఏలేరు తదితర నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. దాంతో ఎన్నడూ నీటి చుక్క చేరని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు కూడా నిండిపోయాయి. వాటి కింద ఆయకట్టుకు ప్రభుత్వం నీటిని విడుదల చేస్తుండటంతో రైతులు ఆనందంతో ఉన్నారు.వర్షాభాయ ప్రాంతం అనంతపురం జిల్లాలో పెన్నా బేసిన్‌లోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు దశాబ్దాల తర్వాత నిండింది. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే వేదవతి (హగరి) దశాబ్దాల తర్వాత ఉరకలెత్తడంతో ఎన్నడూ నిండని భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ) కూడా నిండింది. శ్రీకాకుళం జిల్లాలో సువర్ణముఖి నది ఉప్పొంగడంతో మడ్డువలస ప్రాజెక్టు ఈ ఏడాది రెండుసార్లు నిండింది. రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు అన్ని చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు నిండిపోయాయి.ఇప్పటి వరకు ఎన్నడూ 10 లక్షల ఎకరాలకు కూడా నీరందని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల ఆయకట్టు.. ఇప్పుడు పూర్తి స్థాయిలో నీరందుకుంటోంది. ఏమాత్రం వృథా కాకుండా యాజమాన్య పద్ధతుల ద్వారా ఆయకట్టు చివరి భూములకూ నీళ్లందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనివల్ల ఈ ఏడాది రికార్డు స్థాయిలో పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నారు.

## రోజాకు చెక్ పెడుతున్నారా

తిరుపతి, ఫిబ్రవరి 5, ఎమ్మెల్యే రోజా. జగనన్నకి దేవుడిచ్చిన చెల్లి. సొంత చెల్లికి చెక్ పెట్టినట్టే.. ఈ చెల్లినీ జగన్‌రెడ్డి సైడ్ చేస్తున్నారా? తనకు ఎంతో కావలసిన మంత్రి పెద్దిరెడ్డి కోసం.. తనకోసం ఎంతో చేసిన రోజమ్మను పక్కనపెట్టేస్తున్నారా? నగరి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా రెబెల్స్‌ను రెచ్చగొడుతున్నారా? వారికి కీలక పదవులు కట్టబెట్టి.. రోజాపై ఉసుగొల్పుతున్నారా? అనే చర్చ జరుగుతోంది. తాజాగా, శ్రీశైలం బోర్డు చైర్మన్‌గా రెడ్డివారి చక్రపాణిరెడ్డిని నియమించారు సీఎం జగన్. ఈ చక్రపాణిరెడ్డి మరెవరో కాదు.. నగరిలో ఎమ్మెల్యే రోజాకు ఏకు మేకుగా మారిన వైసీపీ నేత. నిండ్ర ఎంపీపీ ఎన్నికల్లో రోజా వర్గానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడారు. రోజా గొడవ గొడవ చేసి.. నిండ్రను ఎలాగోలా తన మనిషికి కట్టబెట్టించుకున్నారు. అప్పుడు నిండ్రలో చక్రపాణిరెడ్డిని పక్కనపెట్టినందుకు.. ఇప్పుడు ఆయనకు ఏకంగా మరింత రాష్ట్రవ్యాప్త ప్రాముఖ్యత ఉన్న శ్రీశైలం బోర్డు చైర్మన్ పదవి కట్టబెట్టడం రోజాకు షాకింగ్ పరిణామమే. కేవలం చక్రపాణిరెడ్డి మాత్రమే కాదు.. ఎమ్మెల్యే రోజాను గట్టిగా వ్యతిరేకించే నగరి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ,కేజీ కుమార్ సతీమణి శాంతికి.. ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది. ఈ రెండు పదవులతో రోజాపై ఆమె వ్యతిరేక వర్గం రాజకీయంగా ఆధిపత్యం సంపాదించనట్టే అంటున్నారు. తెలిసి తెలిసి జగనన్న తన వ్యతిరేకులను ఎందుకంత కీలక పోస్టుల్లో కూర్చోబెడుతున్నారని రోజా కలత చెందుతున్నారు. ఇదంతా, మంత్రి పెద్దిరెడ్డి మాట కాదనలేక.. ఆయన తిరగబడకుండా చూసుకునేలా.. రోజా రెబెల్స్‌ను ఇంతలా ఎంకరేజ్ చేస్తున్నారనేది ఓపెన్ టాక్. మరి, నియోజకవర్గం వ్యాప్తంగా శత్రువులను పోగేసుకున్న రోజమ్మ.. వచ్చే ఎన్నికల్లో నగరిలో ఎలా నెగ్గుకొస్తారో..?

## రాజీనామా తప్పదా

అనంతపురం, ఫిబ్రవరి 5, )డైలాగులు చెప్పడానికి బాగానే ఉంటాయి. అందులో అఖండ లాంటి సినిమాలో అలవోకగా డైలాగులు చెప్పిన బాలకృష్ణ ఇంకా ఆ జోష్ నుంచి బయటకు రాలేదనే అనిపిస్తుంది. హిందూపురం జిల్లాలో ఈరోజు పర్యటించిన బాలకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం. మరోసారి భారీ డైలాగులు కొట్టారు. హిందూపురంను జిల్లా కేంద్రంగా ప్రకటించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బాలకృష్ణ ప్రకటించారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో బాలకృష్ణ ఆ సాహసం చేయగలరా? సినిమా కాదు. చపట్లు అందుకోవడానికి ఈ డైలాగు కొట్టి ఉండవచ్చు. కానీ ఆచరణలో ఇప్పుడు సాధ్యం కాని పని. తెలుగుదేశం పార్టీ పరిస్థితి అంత బాగా లేదు. ఇప్పుడు బాలకృష్ణ చేసిన డిమాండ్ ను ప్రభుత్వం పరిశీలించే పరిస్థితి కూడా లేదు. పుట్టపర్తినే జిల్లా కేంద్రంగా కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకకుంటే బాలకృష్ణ నిజంగా రాజీనామా చేస్తారా? అన్నది సందేహమే. ఇప్పుడున్న పరిస్థితుల్లో.... ఇక ఎన్నికలకు రెండేళ్లు మాత్రమే సమయం ఉంది. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ హిందూపురంలో వైసీపీ విజయం సాధించింది. ఈ పరిస్థితుల్లో బాలకృష్ణ రాజీనామా చేయడం అనేది జరగని పని. మరో వైపు చంద్రబాబు రాజీనామా చేసి తిరిగి ఉప ఎన్నికలకు వెళ్లేందుకు అస్సలు అంగీకరించరు. గత ఎన్నికల్లోనే అనంతపురం జిల్లాలో హిందూపురం, ఉరవకొండ నియోజకవర్గాలు మాత్రమే టీడీపీ గెలిచింది. హిందూపురంలో టీడీపీ బలంగా ఉండవచ్చు. సాధారణ ఎన్నికలు వేరు. ఉప ఎన్నికలు వేరు. బాలకృష్ణ తన అభిమానులను అలరించడానికి, మురిపించడానికి ఇలాంటి రాజీనామా డైలాగ్ ను కొట్టి ఉండవచ్చు. కానీ అది ఆచరణ సాధ్యం కాదు. రేపు నిజంగా హిందూపురంను జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించకపోతే ఆ డైలాగ్ కు విలువ లేకుండా పోతుంది. అయితే తొలిసారి బాలకృష్ణ ఇలా రాజీనామా ప్రకటన చేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి రాజీనామా వ్యవహారం డైలాగుగా మిగిలిపోతుందా? లేక నిజంగా హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించకుంటే రాజీనామా చేస్తారా? అన్నది చూడాల్సి ఉంది.

## ఏయూలో డిజిటల్ గ్రంథాల ప్రయోగం

విశాఖపట్నం పురాతన గ్రంథాలను డిజిటల్ చెయ్యడంలో విశాఖ ఏయూ చేసిన ప్రయోగం సక్సెస్ అయ్యింది.ఏళ్ల చరిత్ర కలిగిన గ్రంథాలను డిజిటల్ చేసి వాటిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో వాటిని అంతర్జాలంలో పొందుపరిచే విధానాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో మొదలు పెట్టింది విశాఖ ఏయూ.దీంతో దాతల సహకారంతో పురాతన గ్రంథాలను డిజిటల్ చేసే ప్రక్రియను పూర్తి చేసింది.డిజిటల్ యుగంలో తాళ్లపత్ర గ్రంథాలు వాటి విశిష్టతను భావి తరాలకు తెలిసే విదంగా ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు వీసీ ప్రసాద్ రెడ్డి తెలిపారు.డిజిటల్ చేసిన గ్రంథాలను ప్రత్యేక వెబ్ సైట్ లో కూడా అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.

# ప్రకాశంలో ఆరెండూ టెన్షన్...

ఒంగోలు,ఫిబ్రవరి 5, అద్దంకి, చీరాల నియోజకవర్గాలు ఈసారి టీడీపీ, వైసీపీకి ప్రతిష్టాత్మకమే. చీరాలలో మరోసారి గెలవాలన్నది టీడీపీ యత్నం. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలన్నది వైసీపీ పట్టుదలగా ఉంది. అద్దంకిలోనూ అదే పరిస్థితి. అక్కడ తమ పార్టీ జెండా ఎగరేయాలని వైసీపీ భావిస్తుంది. అదే సమయంలో టీడీపీ పట్టు కోల్పోకూడదని ఆశిస్తుంది. అందుకే ప్రకాశం జిల్లాలో ఈ రెండు నియోజకవర్గాలు హాట్ సీట్లుగా మారిపోయాయి. ఇప్పుడు రెండు నియోజకవర్గాలు కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో చేరిపోయాయి. ఈ జిల్లాలో వైసీపీ మరింత బలపడాల్సిన అవసరం ఉంది.. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో టీడీపీ బలంగా ఉన్నట్లు కన్పిస్తుంది. ఈ జిల్లా పరిధిలోని అద్దంకి, పర్చూరు, రేపల్లె, చీరాలలో గత ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. వేమూరు, బాపట్ల లో మాత్రమే వైసీపీ గెలిచింది. అందుకే సమీకరణాలన మార్చాలని నిర్ణయించింది. చీరాల నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో టీడీపీ నుంచి విజయం సాధించిన కరణం బలరాం తర్వాత వైసీపీ మద్దతుదారుగా మారిపోయారు. ఈసారి చీరాల టిక్కెట్ కరణంకు డౌటే. తిరిగి వైసీపీ ఆమంచి కృష్ణమోహన్ కే కేటాయించే అవకాశాలు చాలా వరకూ ఉన్నాయి. అందుకే చీరాలలో ఇద్దరికి సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రెండు వర్గాలు ఒకటయితే గెలుపు సునాయాసమని భావిస్తున్నారు. ఇక అద్దంకి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ను ఓడించడం అంత సులువు కాదు. ఆయన వరస గెలుపులతో జోరు మీదున్నారు. ఈసారి కూడా గెలుపు తనదేనన్న ధీమాతో ఉన్నారు. ఇక్కడి నుంచి ఈసారి వైసీపీ కరణం వెంకటేష్ ను పోటీ చేయించాలని భావిస్తుంది. కరణం కుటుంబానికి అద్దంకి నియోజకవర్గంలో పట్టు ఉండటంతో ఈసారి కరణం వెంకటేష్ కు అద్దంకి సీటు దాదాపుగా వైసీపీ ఖరారు చేసినట్లే అని చెబుతున్నారు. ఇప్పటి నుంచే... అయితే అక్కడ కమ్మ సామాజికవర్గం ఓటర్లు ఎక్కువగా ఉండటం, గొట్టిపాటి రవికుమార్ స్ట్రాంగా ఉండటంతో కరణం బలరాం ఇటీవల సైలెంట్ అయ్యారని చెబుతున్నారు. తాను వైసీపీలో చేరడంతో సొంత సామాజికవర్గం ఓట్లకు గండిపడకుండా ఆయన ఇప్పటి నుంచి చర్యలు ప్రారంభించారు. ఇక చీరాలలో టీడీపీ కొత్తవారికి అవకాశమివ్వనుందన్న టాక్ వినపడుతుంది. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన చిరంజీవి పేరు వినపడుతుంది. మొత్తం మీద వైసీపీ, టీడీపీ లు రెండు నియోజకవర్గాలపై గట్టిగానే కన్నేశాయి.

# బద్వేలు లో ఉద్రిక్తత

కడప కడప జిల్లా బద్వేలు లో రోజురోజుకు పెరిగిపోతున్న రౌడీ ఇజం కులాల వారీగా విడిపోయి ఒక వర్గం పై మరొక వర్గం దాడి చేసింది. ఈ దాడులకు రాజకీయ రంగు పులుముకావడంతో ఉద్రిక్తతంగా మారి బాధితులు పోలీసుస్టేషన్ ను చుట్టుముట్టారు. గతంలో ఒక వర్గం స్టేషన్ ఎదుట ఆందోళన చేయడంతో మేమేమీ వారికి తక్కువ కామని మరోవర్గం ఈరోజు ఆందోళనకు దిగింది.. ఆడవారి పై విచక్షణా రహితంగా దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని పోలీస్ స్టేషన్ ను చుట్టుముట్టారు. ఈ క్రమంలో ఆందోళనకారులు ఒకానొక దశలో నాలుగు రోడ్ల సెంటరులో ట్రాఫిక్ కు సైతం అంతరాయం కలిగించారు. ఆందోళన కారులను నిలువరించడానికి విఫలయత్నం చేసారు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశామని అన్నారు. వారిలో ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని మిగతా వారిని వీలైనంత త్వరగా అరెస్ట్ చేస్తామని ఆందోళనకారులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ఇలాంటి వర్గ పోరుకు రాజకీయ రంగు పులుముకోవడం గమనార్హం.ఇలాంటి పరిస్థితులను అదుపు చెయ్యటంలో పోలీసులకు తలనొప్పిగా మారినది.

# అధికారులపై దాడి కేసులో నిందితుడు ఆరెస్టు

విశాఖపట్నం విశాఖలో సంచలనంగా మారిన అధికా రులపై దాడి కేసులో దొడ్డి కిరణ్ ను పో లీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. పెం దుర్తి,సత్తివానిపాలెంలో ప్రభుత్వ భూ ముల్లో ఆక్రమణలు తొలగించేందుకు వచ్చిన అధికారులపై నిందితులు దాడికి దిగారు. దాడిలో గాయపడిన రెవెన్యూ సిబ్బం ది ఘటన పై పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈమేరకు దొడ్డి కిరణ్ తోపాటు అతని అనుచరులపై పోలీ సులు కేసు నమోదు చేశారు.రెవిన్యూ ఉద్యోగుల పై దాడిలో ఏ1 ముద్దాయి దొడ్డి కిరణ్ ను ఎట్టకేలకు పంజాబ్ అమృత్ సర్ లో పట్టుకున్నారు. ఢిల్లీ నుండి విశాఖ కు తీసుకువచ్చి పెందుర్తి స్టేషన్ కు తరలించారు.న్యాయ స్థానం లో హాజరుపరిచే అవకాశం ఉంది. ఇప్పటికే భూకబ్జా కేసులో నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు. కిరణ్ తో పాటు పరారీలో ఉన్న డ్రైవర్ పవన్ ను అదుపులోకి తీసుకున్నారు.

# ఆలయాల అభివృద్ధికి నిధుల కేటాయింపు

**మంత్రి వెల్లంపల్లి**

విజయవాడ రాష్ట్రంలో హిందూ ఆలయాల అభివృద్ధి కోసం నిధులను సీఎం జగన్ కేటాయిస్తున్నారని దేవా దాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీని వాసరావు తెలిపారు. ఇంద్రకీలాద్రి పై ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిం చి సమీక్ష జరిపారు.అనంతరం ఆయ న మాట్లాడుతూ దుర్గగుడి అభివృద్ధి పనులపై ఈ రోజు సమీక్ష చేశామ న్నారు. పనుల వివరాలపై దేవాదాయ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారని ఆయన తెలిపారు. సీఎం అడిగిన వెంటనే దుర్గగుడికి నిధులు కేటాయిం చారని ఆయన పేర్కొన్నారు.అప్పుడ ప్పుడు కొండ చరియలు పడుతయ న్నాయన్నారు.ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడ తామని ఆయన తెలిపారు.గతంలో ఏ ప్రభుత్వమూ ఆలయానికి నిధులు ఇవ్వలేదన్నారు.సాధ్యమైనంత త్వర గా పనులు పూర్తి చేసి భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.


# శ్రీనగర్లో ఎన్ కౌంటర్...

**ఇద్దరు ఉగ్రవాదుల హతం**

శ్రీనగర్ జమ్మూకశ్మీరులోని శ్రీనగర్ ప్రాంతంలో శనివారం జరిగిన ఎన్కౌంటర్లో లష్కరే తోయిబా కు సంభందించిన రెసిస్టెన్స్ ఫ్రంట్ కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. శ్రీనగర్ నగరంలోని జకూర ప్రాంతంలో శనివారం భద్రతా బలగాలకు లష్కరే తోయిబా ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.ఈ ఎదురు కాల్పుల్లో ఉగ్రవాది ఇఖ్లాఖ్ హాజమ్ మరణించాడని కశ్మీర్ జోన్ ఐజీ విజయ్ కుమార్ చెప్పారు. ఇఖ్లాఖ్ హాజమ్ ఇటీవల అనంత్ నాగ్ వద్ద హెడ్ కానిస్టేబుల్ అలీ మహమ్మద్ ఘనీని హతమార్చాడని పోలీసులు చెప్పారు. మరణించిన ఉగ్రవాదుల వద్ద నుంచి రెండు పిస్టల్లను స్వాధీనం చేసుకున్నామని కశ్మీర్ జోన్ పోలీసులు చెప్పారు. ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాల గాలింపు కొనసాగుతుందని పోలీసులు వివరించారు.

# మాఘ మాసంతో మళ్లీ కరోనా...

హైదరాబాద్, ఫిబ్రవరి 5, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకోవడానికి మాఘమాసానికి మించిన మంచి ముహూర్తం లేదు. అయితే ఈ పెళ్లిళ్ల సందడి, ఇతరు శుభకార్యాలు కరోనా విరుచుకుపడేందుకు కారణమవుతాయా అన్న అనుమానం వెంటాడుతూనే ఉంది. ఇప్పుడిప్పుడిప్పుడే తగ్గుముఖం పట్టిన కొవిడ్ వైరస్ ఇదే మంచి ముహూర్తమని చెలరేగిపోయే అవకాశం ఉందన్న అభిప్రాయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిబంధనలు పాటించకపోతే కరోనా పంజా విసిరే ప్రమాదం ఉంటుందని భావిస్తున్న అధికార యంత్రాంగం కట్టడి చేసేలా జాగ్రత్తలు పాటించపోతే పరిస్థితి ఏమిటన్న చర్చకు తెర తీస్తోంది. చిత్తూరు జిల్లాలో దడ పుట్టించిన మూడు దశ కొవిడ్ క్రమంగా తగ్గుముఖం పడుతుండగా గత వారంతో పోల్చితే ఈ వారం కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఒక వైపు టెస్టుల సంఖ్య తగ్గడం అందుకు తగ్గట్టుగానే పాజిటివిటీ రేటు కూడా పడిపోవడంతో జనంలో కరోనా భయం మెల్లిమెల్లిగా పోతోంది. అయితే మాఘ మాసం పెళ్లిళ్ల ముహుర్తాలు ముంచుకు రావడంతో పరిస్థితి కరోనా మహమ్మారికి మళ్లీ అనుకూలంగా మారుతుందేమోనన్న భయం నెలకొంది. కొవిడ్ కేసుల సంఖ్య తగ్గిపోవడం, మరోవైపు ఒమిక్రాన్ భయం లేకపోవడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం భారీ మూల్యం తప్పదని జిల్లా వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు.అయితే పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సమయంలో పాటించాల్సిన కరోనా నిబంధనల అమలు విషయమే ఇప్పుడు సమస్యగా మారింది. గత నెలలో టెస్టులు చేసిన ప్రతి పది మందిలో నలుగురికి కొవిడ్ నిర్ధారణ కాగా ఇప్పుడు అంతమేర ప్రభావం చూపని కొవిడ్ పెళ్లిళ్ల సీజన్పై ప్రభావం చూపుతుందా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫిబ్రవరి మాసమంతా పెళ్లిళ్లకు ముహుర్తాలు ఉండగా శుక్ల పంచమి నుంచి క్రిష్ణ పంచమి వరకు మంచి ముహుర్తాలుగా



పరిగణిస్తుండటంతో వేలాది పెళ్లిళ్లు జరగనున్నాయి. ఈమేరకు తిరుపతిలోని కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాల్స్, హోటళ్లు ముందుగానే బుక్కైపోగా తిరుమలలోని మఠాలు, కళ్యాణ వేదికలను పెళ్లిళ్ల కోసం రిజర్వు అయ్యాయి. ఈనేపథ్యంలో జిల్లాలో దాదాపు 5 వేల పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉండగా ఇప్పటికే పెళ్లిళ్లు జరిపించేందుకు సిద్ధమైన పంతుళ్లు తమకి మాఘమాసం పండగేనంటున్నారు. ఇక పిల్లల పెళ్లిళ్లను ఘనంగా జరిపేందుకు ఇటు పెద్దలు, మూడు ముళ్లతో ఒక్కటయ్యేందుకు అటు నూతన వధూవరులు సన్నద్ధమవుతున్నారు. అయితే శుభకార్యాల చాటున కొవిడ్ కేసుల సంఖ్య పెరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అదేవిధంగా వైరస్ వ్యాప్తికి కారకులు కాకుండా ప్రజలు కూడా సహకరించాల్సిన అవసరం ఉంది.

# కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ పనులను వెంటనే ప్రారంభించాలి

**కడప కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో ఉక్కు సాధన సమితి చైర్మన్ బి నారాయణ డిమాండ్**

కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ఉక్కు సాధన కమిటీ చైర్మన్ బి నారాయణ డిమాండ్ చేశారుస్థానిక కొత్త కలెక్టరేట్ ఎదుట బుక్కు సాధన సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు ఉదయం న్యూస్ ప్రతినిధి ఎమ్మిగనూరు పట్టణంలో ఈ సందర్భంగా బి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర విభజన ఈ సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విభజన చట్టంలోని హామీ మేరకు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి సెయిల్ ఆధ్వర్యంలో నిర్మించాలని హామీ ఇస్తున్నారు కాంగ్రెస్ పార్టీ హయాంలో శంకుస్థాపన కూడా చేశారని గుర్తు చేశారు దాన్నే ప్రారంభంలోనే గాలికి వదిలేస్తున్నారు విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వన్ వేరొకచోట ఉక్కు ఫ్యాక్టరీ శంకుస్థాపన చేసి వదిలేస్తున్నారు ఆ తర్వాత అధికారంలోకి వచ్చినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కూడా శంకుస్థాపన రాళ్ల కే పరిమితం అయింది అన్నారు జిల్లాలో సేయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని నాడు బిజెపి ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా చట్టం చేసి ఏడు సంవత్సరాలు పూర్తయింది నేటికీ శిలా పథకాలు కే పరిమితమై పరిశ్రమ పనులు ప్రారంభానికి నోచుకోలేదు అని మండిపడ్డారు రాష్ట్రంలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారినా ఉక్కు స్థాపనకు ఒక్క అడుగు కూడా ముందుకు వేసిన దాఖలాలు లేవన్నారు ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కారణంగా ప్రత్యక్షంగా లక్షమందికి పరోక్షంగా లక్షా 25 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశాలు ఉన్న పాలక పక్షాలు పట్టీపట్టనట్లు వ్యవహరించటం దుర్మార్గమైన చర్య అని ఆయన అన్నారు పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న కనీసం ఒక్క ఫ్యాక్టరీ గురించి చర్చించకపోవడం బాధాకరమన్నారు అనునిత్యం కరువు వలసలు నిరుద్యోగం ఆత్మహత్యలతో అల్లాడుతున్న రాయలసీమకు ఉక్కు ఫ్యాక్టరీ ఎంతో ఉపయోగకరమైన అన్నారు విశాఖ ఉక్కు సాధన కోసం 32 మంది ఆత్మబలిదానాలు చేసిన వారిని స్ఫూర్తిగా తీసుకుని మరోమారు కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఉద్యమిస్తామని పిలుపునిచ్చారు అనంతరం డి ఆర్ డి ఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఏ సత్తార్ ఉక్కు సాధన సమితి జిల్లా కార్యదర్శి ఆర్ వి ప్రసాద్ సిపిఎం నగర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి,పాపిరెడ్డి, సిపిఐ ఎమ్మెల్ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ రాము బ్లడ్ 2 లివ్ ఫౌండర్ పట్టుపురుగుల పవన్ కుమార్ ఏపీ నిరుద్యోగ పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ డి ఎం ఓబులేసు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గురప్ప డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని జిల్లా కార్యదర్శి శివకుమార్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కో కన్వీనర్ చంద్రారెడ్డి ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి తిరుమలేశు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ తెలుగు యువత జిల్లా అధ్యక్షులు జియావుద్దీన్ డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నరసింహ ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు సురేష్, ఆదిత్య కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మైన్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# నిన్నటి వరకు చేతులతో బేడీలు

**ఇవాళ ఆ చేతులకే బేడీలు**

నెల్లూరు, ఫిబ్రవరి 5,అతడో పోలీస్. అన్యాయాలు జరగకుండా చూడాలి. అక్రమార్కుల తాట తీయాలి. కానీ అతడే ట్రాక్ తప్పాడు. డబ్బు కోసం తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నాడు. పలువురికి బేడీలు వేయాల్సిన వ్యక్తి ఇప్పుడు ఊచలు లెక్కబెడుతున్నాడు. ఇంతకీ అతడు చేసింది.. ఏం తప్పో చెప్పలేదు కదూ.. స్మగ్లింగ్. అది కూడా అరుదైన వన్యప్రాణి సంపదను. నక్షత్ర తాబేళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని నెల్లూరు జిల్లాలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. చెన్నైకు చెందిన సెల్వ కుమార్ 1 కాదు, 2 కాదు.. 10 కాదు ఏకంగా? 250 తాబేళ్లను స్మగ్లింగ్ చేయాలని చూశాడు. అందుకు అతడు ఆర్టీసీ బస్సును ఎంచుకున్నాడు. బస్సు అయితే ఎవరికీ అనుమానం రాదని భావించాడు. కనిగిరి ఆర్టీసీ బస్సులో తమిళనాడుకు నక్షత్ర తాబేళ్లు తీసుకెళ్లుతుండగా? బీవీ పాలెం వద్ద నిర్వహించిన తనిఖీల్లో దొరికిపోయాడు. పట్టుబడిన నిందితుడు చెన్నై ఆవడి పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. చెన్నైలో ఎక్వేరియం నడుపుతున్న నిందితుడు? బెంగాల్, కర్ణాటకతదితర రాష్ట్రాలకు వివిధ రకాల వన్యప్రాణులను ఎగుమతి చేస్తున్నట్లు వివరించారు. వీటి విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటుందని? వీటిని చెన్నై నుండి మలేషియాకు తరలించి ఎనిమిది నుండి పది లక్షల రూపాయలు మధ్య అమ్మకాలు సాగిస్తూనట్లు వెల్లడైందని తెలియజేశారు. స్వాధీనం చేసుకున్న నక్షత్ర తాబేళ్లను వెంకటగిరి అటవీశాఖ అధికారులకు అందజేయనున్నట్లు? స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు తెలిపారు.

# కొత్త జిల్లాల పై అనవసర రాద్ధాంతం

గుంటూరు, ఫిబ్రవరి 5, ఆంధ్రప్రదేశ్ లో కొత్త జిల్లాల ప్రకటనపై రగడ కొనసాగుతూనే ఉంది. జిల్లాల పునర్విభజనను కొందరు స్వాగతిస్తుండగా.. మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో జిల్లాల పేర్ల విషయంలోనూ అభ్యంతరాలు వ్యక్తమవుతుంటే.. మరికొన్ని చోట్ల తమ ప్రాంతాలను కూడా జిల్లా కేంద్రాలుగా మార్చాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కడప, అనంతపురం, నెల్లూరు జిల్లాలో ఈ ఆందోళనలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతిపక్ష నేతలు కూడా ఆందోళనకారులకు మద్దతుగా నిలుస్తున్నారు. వీటిపై విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డిస్పందించారు. కొత్త జిల్లాల ప్రతిపాదనలపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఇందులో ఎలాంటి రాజకీయ అంశాలకు తావు లేదని సమర్థించుకున్నారువాళ్ల సంగతి కూడా తేలుస్తాం.. ‘కడపజిల్లాలో రాజంపేట పార్లమెంట్ పరిధిలో రాయచోటి కేంద్రంగా జిల్లా కేంద్రంగా ప్రతిపాదించాం. అదేవిధంగా హిందూపురం పరిధిలో పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి పేరుతో జిల్లా పెట్టాలని ప్రతిపాదించాం. విదేశాల్లో సైతం సత్యసాయికి భక్తులు ఉన్నారు. ఈనేపథ్యంలోనేభక్తులకు అనుకూలంగా ఉంటుందని సత్యసాయి జిల్లాను ఏర్పాటుచేయాలనుకుంటున్నాం. ఇక కృష్ణాజిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టాం..అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు ఎలాగూ ఈ ప్రయత్నం చేయలేకపోయారు. ఎన్టీఆర్ కూతురు దగ్గుబాటి పురందేశ్వరి జిల్లాకు తన తండ్రి పేరు పెట్టాలని, భారతరత్న ఇవ్వాలని లేఖ రాశారు. ముఖ్యమంత్రిగా ఎన్నో ఏళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు కనీసం లేఖ కూడా రాయలేకపోయారు. ఒంగోలుకు చెందిన గుప్తా తనకు న్యాయం చేయాలని ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఫ్లెక్సీ ప్రదర్శించారని తెలిసింది. అమిత్‌షాతో పాటు అమెరికా అధ్యక్షుడికి కూడా ఫిర్యాదు చేసుకోమనండి? గుప్తా వెనుక ఎవరు ఉన్నారో తెలుసు. వాళ్ల సంగతి సంగతి కూడా తేలుస్తాం. ఇక తుని ఘటనపై కేసులు ఎత్తివేయడంపై కాపు సోదరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు’ అని మంత్రి పేర్కొన్నారు

# తిరుమలకు పెరుగుతున్న భక్తులు..

**8న రథసప్తమికి ఏర్పాట్లు**

తిరుమల, ఫిబ్రవరి 5, కరోనా మహమ్మారి కారణంగా గతంలో తిరుమలకు వెళ్ళే భక్తుల సంఖ్య తగ్గింది. ఇటీవల కాలంలో భక్తులు పెరుగుతున్నారు. ప్రతిరోజూ కలియుగ వైకుంఠం తిరుమలకు వెళ్ళి స్వామివారిని దర్శించుకునే భక్తుల సంఖ్య క్రమేపీ పెరగడంతో ఆదాయం కూడా భారీగానే వస్తోంది. తాజాగా శుక్రవారం తిరుమల శ్రీవారిని 28, 410 మంది దర్శించుకున్నారు. 14,813 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తుల రాకవల్ల టీటీడీకి రూ.2.08 కోట్ల ఆదాయం లభించింది.8వ తేదీన రథసప్తమి వేడుకలను ఏకాంతంగా నిర్వహించనుంది టీటీడీ. 16వ తేదీ నుంచి సర్వదర్శనం భక్తులకు ఆఫ్ లైన్ విధానంలో దర్శన టోకేన్లు జారి చేసే అవకాశం వుందని తెలుస్తోంది. 16వ తేదీన ఆకాశగంగ వద్ద ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనులకు, తరిగొండ వెంగమాంబ బృందావనం అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నారు. 17వ తేదీన టీటీడీ పాలకమండలి సమావేశం కానుంది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం వుంది.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ మర్రి స్వామి తాత ఆరాధన ఉత్సవ వేడుకలు

కౌతాళం మండల కేంద్రంలో శ్రీ కృష్ణ అవధూత ఆశ్రమం లో శ్రీ శ్రీమతి మర్రి స్వామి తాత వేడుకలు ఘనంగా జరిగాయి మూడు రోజుల పురాణాలు అనంతరం శ్రీ కృష్ణ అవధూత ఆశ్రమం లో ప్రత్యేక పూజలు అనంతరం శ్రీశ్రీశ్రీ మరి స్వామి తాత ఆరాధన ఉత్సవం సందర్భంగా కాలనీల్లో గ్రామాల్లో భారీగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రజలు తండోపతండాలుగా వెళ్లి దర్శనం చేసుకున్నారు సాయంత్రం తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షులు చిన్న బసప్ప ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ మర్రి స్వామి తాత తులాభారం నిర్వహించారు.

# ఎంపి రఘురామరాజుకు వ్యతిరేకంగా అందోళనలు

**ఆర్యవైశ్య సంఘాల నిర్ణయం**

ఏలూరు ప్రభుత్వం చింతామణి నాటకం రద్దు చేయటాన్ని వ్యతిరేకిస్తూ నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు కోర్టులో కేసు వేయటాన్ని నిరసిస్తూ ఆర్య వైశ్య సంఘాలుఆందోళన కార్యక్రమాలకు పిలుపినిచ్చాయి. ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ,పశ్చిమ గోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘము సంయుక్త ఆధ్వర్యంలో రఘురామ కు వ్యతిరేకం గా నరసాపురం పార్లమెంట్ పరిధిలో మూడు రోజులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆర్య వైశ్యుల మనోభావాలను దెబ్బ తీసే రీతిలో వ్యవహరిస్తున్న రఘురామకృష్ణంరాజు తగిన రీతిలో పార్టీలకతీతంగా ఆర్యవైశ్యులు బుద్ధి చెప్పాలంటూ కుప్పం ప్రసాద్ పిలుపునిచ్చారు.

# బాలకృష్ణ దీక్షతో ఒరిగేది ఏమీలేదు

**పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి**

అనంతపురం రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లా లు ఏర్పాటు లో భాగంగా అనంతపురం జిల్లాలోని హిందూపురం పార్లమెంట్ పరిధిలో నున్న పుట్టపర్తిని శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించింది. బాలకృష్ణ దీక్షతో ఒరిగేది ఏమిలేదని అంతా వృధా ప్రయాసేనాని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఎద్దేవా చేశారు. అమావాస్యకి పున్నానికి ఒకసారి కనబడే వ్యక్తి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కోసమే ఈ దీక్ష చేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు హిందూపురం జిల్లాగా ప్రకటించకపోతే రాజీనామా చేస్తా అని చెబుతున్నారు. 2014 నుండి 2019 వరకు మీ బావ సీఎంగా ఉన్నప్పుడు హిందూపురం ని ఎందుకు జిల్లాగా ప్రకటించాలేక పోయారు. గతరెండేళ్ల లో మీరెప్పుడు హిందూపూర్ కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయమని కోరలేదు. ఐదు నియోజకవర్గ శాసనసభ్యులు , ఎంపీ తో సహా అందరూ శ్రీ సత్యసాయి జిల్లా కు ఆమోదం తెలిపారు. శ్రీసత్యసాయి బాబా సేవలను గుర్తించి ప్రస్తుత ప్రభుత్వం ప్రజల మనోభావాలుకు పెద్ద పీట వేసి జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం వేశారు. పుట్టపర్తిలో హిందూపురం కంటే మెరుగ్గా మౌలిక వసతులున్నాయి. పార్లమెంట్ కేంద్రాలను జిల్లాలుగా ఏర్పాటు చేయాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన తప్ప మీది కాదని అన్నారు.అన్ని ప్రాంతాలకు కేంద్రీకృతమై పుట్టపర్తి ఉండడం శ్రీసత్యసాయి బాబా సేవలకు గుర్తింపుగా ఏర్పాటు చేసారన్నది మీరు గుర్తిస్తే సముచితంగా ఉంటుంది. మీ వ్యక్తి గత అజెండాతో ఈప్రాంతవాసులకు నష్టం కలిగించకండి మీ వైఖరి మార్చుకొని అభివృద్ధి కొరకు సహకరించండని అన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన

తిరుపతి ఫిబ్రవరి 5 ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ అధ్వర్యంలో సెంట్రల్ బస్టాండు వద్ద నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ నేత సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసినా ఉద్యోగుల సమస్యల ఇప్పటికీ పరిష్కరం కాలేదని... అన్ని సౌకర్యాలను ప్రభుత్వం తొలగించిందన్నారు. విలీనం జరిగిందని ఆనందపడాలో... ఉన్న వసతులు పోయినందుకు భాదపడలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 15 డిపోల ఉద్యోగుల నిరసన జరుగుతోందని చెప్పారు. 2004 ముందు ఉన్న పెన్షన్ విధానాన్ని ఆర్టీసీలో అమలు చేయాలని, ఆర్టీసీ ఉద్యోగులందరికీ పెన్షన్ కచ్చితంగా ప్రభుత్వం ఇవ్వాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో ఉద్యోగులు విధులను బహిష్కరణ

అమరావతి ఫిబ్రవరి 5 రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పెన్‌డౌన్, యాప్ డౌన్ చేసి ఉద్యోగులు విధులను బహిష్కరించారు. కార్యాకలాపాలు నిలిచి పోవడంతో ప్రజలు వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని.. స్టీరింగ్ కమిటీ ఆదేశాలతో కార్యాచరణ కొనసాగుతుందని ప్రకటించారు. విజయవాడలో తహసీల్దారు, పౌర సరఫరాలశాఖ, రిజిస్ట్రేషన్, రవాణా శాఖ, ఆర్అండ్‌బీ శాఖల కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి.

# ఆశా వర్కర్స్ కు గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచాలి

రాజమండ్రి ఆశా వర్కర్స్ కు గౌరవవేతనం రూ.15వేలకు పెంచాలని,ఉద్యోగుల పి.ఆర్.సి.సమస్యను పరిష్కరించాలని,ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాజమహేంద్రవరం మున్సిపల్ ఆఫీసు ముందు జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు,కె.అన్నామని, వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు,ఈ ధర్నా ను ఉద్దేశించి ముఖ్య అతిధిగా సీఐటీయూ నాయకులు బి.పూర్ణిమరాజు మాట్లాడుతూ కరోనా కాలం లో ఆశావర్కర్స్ ఫ్రెంట్. లైన్ వ్యారియర్స్ ప్రజల ప్రాణాలు రక్షించిన వీరికి వీరి ప్రాణాలకు రక్షణ లేదని వీరికి వెంటనే జీవరవ వేతనం రూ.15 వేలు కు పెంచాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని,కోవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు ఒక్కొక్కరికి 10 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని,ప్రభుత్వ. సెలవులు,మెడికల్. లీవులు అమలు చేయాలని,పనిభారాన్ని తగ్గించాలని,వేతనం తో కూడిన మెటర్నిటీ లేవు ఇవ్వాలని,రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని,రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ,ప్రభుత్వ ఉద్యోగుల పి.ఆర్.సి.సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అలాగే ఫిబ్రవరి 7 న కలెక్టర్ ఆఫీస్ దగ్గర జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కోర.అనంతరం నాయకులు ఎం.హెచ్.ఓ. .వినూతన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమం లో రాజమండ్రి అర్బన్ నాయకులు ఎం.దుర్గ,ఎం.హావేలీ,కె.సునీత,సేశారత్నం,దుర్గ,జయ,అనూష,సత్యవతి,శ్యామలా,లక్ష్మి దుర్గ,లీలా మని తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ దేవి అలంకారంలో కనకదుర్గ

విజయవాడ శ్రీపంచమి సందర్భంగా సరస్వతీ దేవి అలంకారం లో కనకదుర్గ అమ్మవారు దర్శనమిచ్చారు.శ్రీ పంచమి సంధర్భంగా చిన్నారాజ గోపురం వద్ద ఉన్న గోశాల వద్ద అమ్మవారి విగ్రహం వద్ద ఆలయ వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించి, సరస్వతీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పైలా సోమినాయుడు దంపతులు, రు, కార్యనిర్వహణాధికారి డి.భ్రమరాంబ, పాలకమండలి సభ్యులు కటకం శ్రీదేవి, ఎన్. సుజాత, ఎన్. రాజ్యలక్ష్మి, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

# ఉచిత ఆపరేషన్ చేసి వృద్ధురాలికి కంటి చూపు

## ప్రార్థించే పెదవ్రులు కన్నా సహాయం చేసే చేతులు మిన్న

## అర్ కె కంటి వైద్యశాల డాక్టర్ హేమంత్ కుమార్



ఎమ్మిగనూరు ఫిబ్రవరి 5 ( విభారె) పట్టణంలో ఉచిత ఆపరేషన్ చేసి అల్లభు అనే వృద్ధురాలికి కంటి చూపు ప్రసాదించిన ఘనత డాక్టర్ హేమంత్ కుమార్ కి దక్కింది.ఎమ్మిగనూరు పట్టణము లోని స్థానిక కబర్సన్ కొట్టాల్లో నివసించు అల్లభు వృద్ధురాలు జీవనం సాగిస్తుంది ఇద్దరు కూతుర్లు భర్త కొన్ని సంవత్సరాల కిందట చనిపోయాడు ఇంటికి పెద్దదిక్కు అల్లభు కుటుంబ పోషణ భారంగా మారింది గత కొన్ని సంవత్సరాలుగా కళ్ళు కనపడక చాలా ఇబ్బంది పడుతున్నారు డాక్టర్లను సంప్రదించగా ఆపరేషన్ చేయించుకోవాలని చెప్పారు రెక్కాడితే గాని డొక్క నిండని పరిస్థితి ఒక పూట గడవడమే చాలా కష్టం అలాంటిది కళ్ళు ఆపరేషన్ ఎలా చేయించుకోవాలి అని వృద్ధురాలు అల్లభు నాకు కంటి చూపు రాదని నిస్సహాయ స్థితిలో ఉండగా ఒకసారి ఆర్.కె.కంటి ప్రైవేట్ వైద్యశాల నిర్వహణ వైద్యులు డాక్టర్.హేమంత్ కుమార్ ని కలిసి అల్లభు పరిస్థితి వివరించగా ,కంటి చూపు లేని అల్లభు కు ఆయన మానవతా హృదయంతో ,సేవా భావంతో స్పందించి, సీనియర్ డాక్టర్ కావడంతో చాలా చ్యాక చక్యంతో శాస్త్ర చికిత్స చేసి , ఎటువంటి ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు.ఆపరేషన్ విజయవంతం అయి వృద్ధునికి కంటి చూపు రావడం జరిగింది.కంటి చూపు రావడంతో అల్లభు కుటుంబం సంతోషాన్ని వ్యక్తం చేశారు .డాక్టర్ హేమంత్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# బొందిమడుగుల రమేష్ నివాసానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్





తుగ్గలి: ఫిబ్రవరి 5 ( విభారె) ఎమ్ఆర్పిఎస్ఎస్రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టిఎం రమేష్ మాదిగ స్వగృహానికి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్ మర్యాదపూర్వకంగా రావడమైనది. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఆదోని డివిజన్ నందు అత్యంత దుర్మార్గంగా మానవత్వం మరచి మానవ మృగాలు ఆధిపత్య వర్గాల వారు దళితులే లక్ష్యంగా దాడులు,దౌర్జన్యాలు, హత్యలు,అత్యాచారాలు మరియు భూకబ్జాలు చేస్తున్నారని ఇందులో భాగంగానే కౌతాళం మండలం కామవరం గ్రామంలో దళితులను ఇద్దరిని అత్యంత దుర్మార్గంగా పాశవికంగా క్రూరంగా వేట కొడవళ్లు గొడ్డలితో దాడిచేసి నరికి పెట్రోల్ పోసి నిప్పంటించి కారం చల్లి హత్య చేయడం చాలా దుర్మార్గమని,ఈ ఘటనపై బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ కామవరం గ్రామంలో బాధిత కుటుంబాలతో సమావేశమై వారి యోగక్షేమాలు తెలుసుకొని బాధిత కుటుంబానికి అండగా ఉండి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం ద్వారా రావాల్సిన కాంపోజిషన్ ఐదెకరాల భూమి హత్య కాబడ్డ కుటుంబం వారికి ఇద్దరికి చొప్పున ప్రభుత్వ ఉద్యోగాలు,5 సెంట్లు స్థలం నివాసం నిర్మించి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం మంజూరు చేసే విధంగా ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకునివెళ్ళి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని పరామర్శించి హత్య చేసిన నిందితులను గ్రామ బహిష్కరణ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంమైనది.అనంతరం ఎమ్ ఆర్ పి ఎస్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టి.ఎం రమేష్ మాదిగ స్వగృహానికి మర్యాదపూర్వకంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ వెళ్లి కుటుంబ సభ్యులతో మమేకమై యోగక్షేమాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ సిఐ రామకృష్ణ రెడ్డి,ఎస్ఐ సమీర్ భాష,తుగ్గలి తాసిల్దార్ నజ్మా భాను,ఆర్ఐ సుధాకర్ రెడ్డి,విఆర్ఓ రాజు నాయక్, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సువర్ణ, రాజు మాదిగఎమ్మార్పీఎస్ ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుంగ సంజయ్ మాదిగ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి యాట ఓబులేష్, ఎమ్మార్పీఎస్ కర్నూల్ పార్లమెంట్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ,బొందిమడుగుల పంచాయతీ ప్రెసిడెంట్ చౌడప్ప,ఎమ్మార్పీఎస్ ఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు హనుమంతు,ఆదోని డివిజన్ అధ్యక్షుడు రామాంజనేయులు,దేవనకొండ మండలం ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు, ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ పెద్దరాజు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా ఇంచార్జ్ జానయ్య,ఎమ్మార్పీఎస్ ఆదోని పట్టణం అధ్యక్షులు రాజు,డోన్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సత్యం,బనగానపల్లె నియోజకవర్గం ఇంచార్జ్ గిరి తదితరులు పాల్గొన్నారు.

# మస్తానయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీదేవి

## కబడ్డీ మరియు దూలం పోటీలను వీక్షించిన ఎమ్మెల్యే

## ఎస్సీ కాలనీలో తాగునీటి పైప్లైన్ ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీదేవి

తుగ్గలి:ఉఫిబ్రవరి 5 ( విభారె) తుగ్గలి మండల పరిధిలోని ముక్కెళ్ల గ్రామంలో శనివారం నిర్వహించిన మస్తానయ్య స్వామి ఉరుసు కార్యక్రమానికి పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరయ్యారు.మస్తానయ్య స్వామి దర్గా వద్ద గ్రామ పెద్దలు ఎమ్మెల్యే కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఎస్సీ కాలనీలో తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను మరియు రాతిదూలం పోటీలను వీక్షించారు.మస్తానయ్య స్వామి ఉరుసు సందర్భంగా రాతిదూలం పోటీల దగ్గరకు వచ్చిన ప్రజల కొరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ ప్రజలు ఉరుసు సందర్భంగా మస్తానయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.ఉరుసు ఉత్సవాలలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై షామీర్ భాష,పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


# ఏడో తేదీన జరుగు సమ్మెను జయప్రదం చేయండి

## ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ





ఎమ్మిగనూరు ఫిబ్రవరి 5 ( విభారె) పట్టణంలో పిఆర్సి సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూడేమోక్రాసి డివిజన్ కార్యదర్శి రాజు, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు ప్రసాద్,పి.డి.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర బాబు పిలుపునిచ్చారు.అనంతరం స్థానిక కార్యాలయం నందు గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రివర్స్ పీఆర్సీని వ్యతిరేకిస్తూ, అషుతోష్ మిశ్రా కమిటీ సిఫార్సుల మేరకు కొత్త పిఆర్సి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఈ నెల 6వ తేదీ అర్థ రాత్రి నుంచి సమ్మెకు పిలుపునిచ్చాయి. ఉద్యోగుల ఇచ్చిన సమ్మె పిలుపును ఐ.ఎఫ్.టి.యు సంపూర్ణంగా బలపరుస్తుంది. ఈ సమ్మెలో క్రియాశీలకంగా పాల్గొంటుంది.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం దగాకోరు పిఆర్సి ప్రకటించిందని, ఇది ఉద్యోగులకు తీవ్ర నష్టదాయకంగా అని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన పీఆర్సీని రద్దుచేసి, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, అషుతోష్ మిశ్రా కమిటీ సిఫార్సుల మేరకు కొత్త పిఆర్సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే సి పి ఎస్ రద్దు చేసి, ఓ పి ఎస్ ప్రకటించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ను గత అక్టోబరు నుంచి ప్రొహిబిషన్ డిక్లేర్ చేసి, పిఆర్సి ప్రకటించాలని, స్కీం వర్కర్లను పిఆర్సి పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెరుగైన పిఆర్సి ఇవ్వలేను అనడం సరికాదని, ప్రజలకు సంక్షేమ పథకాలు ఇస్తున్నాం కనుక ఉద్యోగులకు తక్కువ జీతాలు ఇస్తామనడం సరికాదని హితవు పలికారు. ప్రజల సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే, అషుతోష్ మిశ్రా కమిటీ సిఫార్సుల మేరకు పీఆర్సీ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్రం ఆర్థిక మాంద్యంలో కూరుకు పోవడానికి ప్రధాన కారణం మోడీ ప్రభుత్వం అని విమర్శించారు. రాష్ట్రాల హక్కుల్ని కేంద్రం తన చెప్పుచేతల్లో పెట్టుకుందని, జీఎస్టీ నిధులు విడుదల చేయడం లేదని, విభజన హామీలు అమలు చేయడం లేదని, ప్రత్యేక హోదా గాని, ప్యాకేజీ గాని ఇవ్వడంలేదని, ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడం లేదని, విశాఖ రైల్వే జోన్ కు, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు అంచనాలకు తగ్గట్టు విడుదల చేయడం లేదని విమర్శించారు. జగన్ ప్రభుత్వం కేంద్రంపై పోరాడి మన రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులు రాబట్టాలని, అందుకోసం ప్రజల సహకారంతో పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు ఏసేపు,ప్రతాప్,మనోహర్, రాజు, రావి, సామెలు,భాషా, శివ కుమార్ మొదలైనవారు పాల్గొన్నారు.

# మెగా మూవీ కోసం హైదరాబాద్ లో ల్యాండ్ అయిన లేడీ సూపర్ స్టార్



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం మూడు సినిమాలను సమాంతరంగా చేస్తున్నాడు. ఇప్పటికే ఆచార్య సినిమా విడుదలకు సిద్దంగా ఉండగా లూసీఫర్ రీమేక్ గాడ్ ఫాదర్.. వేదాళం రీమేక్ భోళాశంకర్ మరియు బాబీ దర్శకత్వంలో ఒక సినిమా ను చేస్తున్నాడు. ఈ మూడు సినిమాలు కూడా షూటింగ్ జరుగుతున్నాయి. మొదటగా గాడ్ ఫాదర్ సినిమా ను పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే ఇప్పటికే గాడ్ ఫాదర్ సినిమా చిత్రీకరణ సగానికి పైగా పూర్తి అయ్యింది. చివరి షెడ్యూల్ ను చిరంజీవి మొదలు పెట్టాల్సి ఉండగా ఆయన కరోనా బారిన పడ్డ విషయం తెల్సిందే. కరోనా థర్డ్ వేవ్ మరియు చిరంజీవి కరోనా వల్ల బ్రేక్ పడ్డ గాడ్ ఫార్ సినిమా మళ్లీ షురూ అయ్యింది.చిరంజీవి రెండు మూడు రోజుల తర్వాత షూటింగ్ లో జాయిన్ అయ్యే అవకాశం ఉంది. ఈ లోపు దర్శకుడు చిరంజీవి లేకుండా కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాడట. అందులో భాగంగా లేడీ సూపర్ స్టార్ నయనతార పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ లో నయనతార గాడ్ ఫాదర్ సినిమా షూటింగ్ లో పాల్గొంటుంది. షూటింగ్ ను ముగించుకుని హోటల్ కు వెళ్తున్న సమయంలో నయనతార మీడియా కంట పడింది. ఆమె ను ఆ సమయంలో తమ కెమెరాలో బంధించేందుకు ఫొటోగ్రాఫర్లు ప్రయత్నించారు. నయనతార దాదాపుగా రెండు వారాలకు పైగా నే హైదరాబాద్ షెడ్యూల్ లో పాల్గొంటుందని సమాచారం అందుతోంది.మలయాళ లూసీఫర్ కు రీమేక్ గా రూపొందుతున్న గాడ్ ఫాదర్ సినిమాలో నయనతార పాత్ర ఏంటో అంటూ ప్రస్తుతం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమా లో చిరంజీవి ఇమేజ్ కు తగ్గట్లుగా హీరోయిన్ పాత్రను జొప్పించారా లేదా మరేదైనా కీలక పాత్ర కోసం ఆమెను తీసుకున్నారా అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే చిరంజీవి తో కలిసి నటించిన అనుభవం ఉన్న నయనతార మరోసారి ఈ సినిమా కోసం ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. గాడ్ ఫాదర్ నుండి చిరంజీవి ఫస్ట్ లుక్ ను ఉగాది కానుకగా విడుదల చేస్తారని సమాచారం అందుతోంది.


# రవితేజ మూవీ రిలీజ్ డేట్స్ సీక్రెట్ చెప్పేశాడు




టాలీవుడ్ లో భారీ క్రేజీ చిత్రాలు రిలీజ్ కి రెడీగా వున్నాయి. అయితే గత కొన్ని రోజులుగా వీటి రిలీజ్ కి అనుకూల వాతావరణం కనిపించడం లేదు. తాజాగా పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకుంటున్నా మేకర్స్ లో ఎక్కడో చిన్న భయం.. ఆ కారణంగా రిలీజ్ కి రెడీ గా వున్న చిత్రాలకు సేఫ్టీ కోసం రెండు రిలీజ్ డేట్ లని లాక్ చేసుకుంటున్నారు. ముందు ఈ ట్రెండ్ కి 'ఆర్ ఆర్ ఆర్' మేకర్స్ శ్రీకారం చుట్టారు. ఆ తరువాత మిగతా సినిమాల మేకర్స్ కూడా దీన్ని ఫాలో కావడం మొదలైంది.'ఆర్ ఆర్ ఆర్' ని ముందు మార్చి 18న కానీ లేదా ఏప్రిల్ 28న కానీ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామంటూ మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఇదే ఫార్ములాని రాధేశ్యామ్ భీమ్లా నాయక్ ఆచార్య ఎఫ్ 3 రామారావు ఆన్ డ్యూటీ చిత్రాలు పాటించడం మొదలుపెట్టాయి. తాజాగా 'ఆర్ ఆర్ ఆర్' మార్చి 25నే వచ్చేస్తున్నామని కొత్త డేట్ ని ప్రకటించడంతో మాస్ మహారాజా రవితేజ సినిమా పరిస్థితి ఇప్పుడు ఇరకాటంలో పడింది.మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న 'రామారావు ఆన్ డ్యూటీ' మూవీని మార్చి 25న రిలీజ్ చేస్తున్నామంటూ మేకర్స్ చాలా రోజుల క్రితమే ప్రకటించారు. 'ఆర్ ఆర్ ఆర్' కూడా అదే డేట్ ని ఫైనల్ చేసుకోవడంతో 'రామారావు ఆన్ డ్యూటీ' కోసం రెండు రిలీజ్ డేట్ లని ప్రకటించారు. ముందు అనుకున్న మార్చి 25 తో పాటు ఏప్రిల్ 15ని ఫైనల్ చేసుకున్నారు. ఇదేంటి మార్చి 25ని పక్కన పెట్టి ఏప్రిల్ 15ని ఫైనల్ చేసుకోవచ్చు కదా అని అందరికి అనుమానం మొదలైంది. అయితే మార్చి 25న 'ఆర్ ఆర్ ఆర్'.. పోటీపడుతుంటే ఏప్రిల్ 14న యష్ నటించిన 'కేజీఎఫ్ చాప్టర్ 2' రామబోతోంది.ఆ కారణంగానే 'రామారావు ఆన్ డ్యూటీ' కోసం రెండు రిలీజ్ డేట్ లని లాక్ చేసుకున్నారట మేకర్స్ అయితే ఈ రిలీజ్ డేట్ సీక్రెట్ ని దర్శకుడు శరత్ మండవ తాజాగా బయటపెట్టారు. 'అనుకోకుండా ఈ డేట్ లని ఫిక్స్ చేయలేదని అయితే మాకు మరో ఛాయిస్ లేకపోవడం వల్లే ఈ డేట్ లని ఫిక్స్ చేశామని ఓ క్రిటిక్ అడిగిన ప్రశ్నకు శరత్ మండవ రిప్లై ఇచ్చి 'రామారావు ఆన్ డ్యూటీ' రిలీజ్ డేట్ లపై అసలు సీక్రెట్ బయటపెట్టాడు. దీంతో నెటిజన్ లు అతని ట్వీట్ కు ఫిదా అయిపోయారు. ప్రస్తుతం శరత్ మండవ చేసిన ట్వీట్ నెట్టింట వైరల్ గా మారింది.

# నెట్టింట 'ఆర్ ఆర్ ఆర్' టీమ్ ట్వీట్ వైరల్

దేశ వ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న సినిమాల్లో మొట్టమొదటి స్థానంలో నిలిచిన చిత్రం 'ఆర్ ఆర్ ఆర్'. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తొలి సారి కలిసి నటించిన భారీ మల్టీస్టారర్ చిత్రమిది. అంతే కాకుండా 'బాహుబలి' వంటి లార్జర్ దెన్ లైఫ్ మూవీ తరువాత రాజమౌళి నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై సహజంగానే అంచనాలు స్కై హైకి చేరుకున్నాయి. జనవరి 7న భారీ స్థాయిలో వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేయాలని మేకర్స్ ముందు ప్లాన్ చేశారు.దీంతో వారం ముందుగానే సంక్రాంతి రాబోతోందని ఈ మూవీతో సంక్రాంతి సెలబ్రేషన్స్ ని ఓ రేంజ్ లో చేసుకోవాలని ప్రేక్షకులు అభిమానులు భారీగా ప్లాన్స్ చేసుకున్నారు కానీ కోవిడ్ ఒమిక్రాన్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సినిమా రిలీజ్ అంత మంచిది కాదని భావించిన మేకర్స్ 'ఆర్ ఆర్ ఆర్' రిలీజ్ ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి షాకిచ్చారు. దీంతో ఊహించని వార్త 'ఆర్ ఆర్ ఆర్' మేకర్స్ నుంచి రావడంతో ప్రేక్షకులు కొంత నిరుత్సాహానికి గురయ్యారు.అయితే తాజాగా వైరస్ అదుపులోకి వస్తున్న నేపథ్యంలో పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని గమనించిన 'ఆర్ ఆర్ ఆర్' మేకర్స్ ఈ మూవీని మార్చి 25న ప్రపంచ వ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదల చేస్తున్నట్టుగా ప్రకటించారు. దీంతో అభిమానుల్లో సంబరాలు మొదలయ్యాయి. కోరుకున్న సినిమా.. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సినిమా ఖచ్చితంగా మార్చి 25న థియేటర్లలో సందడి చేయడానికి రెడీ అయిందని తెలియడంతో ప్రేక్షకుల్లోనూ నూతనోత్సాహం కనిపిస్తోంది.ఈ ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ 'ఆర్ ఆర్ ఆర్' టీమ్ టాజాగా ఆన్ లొకేషన్ కి సంబంధించిన ఓ ఫొటోని సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా షేర్ చేసింది. సినిమాలోని కీలక ఘట్టంలో హీరోలు రామ్ చరణ్ హార్స్ పై ఎన్టీఆర్ మోటర్ సైకిల్ పై కదనోత్సాహంతో కదులుతున్న సందర్భానికి సంబంధించిన ఫొటో ఇది. ఈ ఫొటోకి ఓ అందమైన క్యాప్షన్ ని కూడా జత చేశారు.మరో 50 రోజుల్లో సినిమా థియేటర్లలో రేసింగ్ ప్రారంభం కాబోతోంది. 'ఆర్ ఆర్ ఆర్' మూవీ ఫైర్.. జల ప్రవాహం' అంటూ ట్వీట్ చేశారు. అంతే కాకుండా మార్చి 25న మేము మిమ్మల్ని చూస్తాం' అంటూ గుర్రం మోటర్ సైకిల్ సింబల్స్ ని షేర్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్ గా మారింది.



# ఆఖరి వరకు ఉత్కంఠ.. అదరగొట్టిన భారత సంతతి కుర్రాడు.. ఆసీస్‌దే విజయం



భారత సంతతి కుర్రాడు, ఆస్ట్రేలియా క్రికెటర్ నివేథన్ రాధాకృష్ణన్ అండర్ 19 ప్రపంచకప్ టోర్నీలో అదరగొట్టాడు. ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆసీస్‌ను విజయతీరాలకు చేర్చాడు. తద్వారా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కాగా వెస్టిండీస్ వేదికగా సాగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో మూడో స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా యువ జట్టు అఫ్గనిస్తాన్‌తో తలపడింది. శుక్రవారం నాటి ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్గన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్ మహ్మద్ ఇషాక్(34 పరుగులు), కెప్టెన్ సులేమాన్ సైఫీ 37 పరుగులు, అహ్మద్ అహ్మద్‌జై 81 పరుగులతో రాణించడంతో 10 వికెట్ల నష్టానికి అఫ్గన్ 201 పరుగులు చేసింది. నివేథన్ రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో లక్ష్య ఛేదనకు దిగిన ఆసీస్‌కు మంచి ఆరంభం లభించింది. ఓపెనర్ కాంప్‌బెల్ కెలావే(51 పరుగులు) అర్ధ శతకంతో రాణించగా.. వన్‌డౌన్‌లో వచ్చిన నివేథన్ రాధాకృష్ణన్ 66 పరుగులు సాధించాడు. ఆ తర్వాత టపాటపా వికెట్లు పడ్డాయి.అయితే, ఆఖరి వరకు ఉత్కంఠ రేపిన ఈ మ్యాచ్‌లో విజయం ఎట్టకేలకు ఆసీస్‌నే వరించింది. రెండు వికెట్లు పడగొట్టడం సహా హాఫ్ సెంచరీతో విజయంలో కీలక పాత్ర పోషించిన నివేథన్ రాధాకృష్ణన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. కాగా సెమీ ఫైనల్ మ్యాచ్‌లలో భాగంగా అఫ్గన్.. ఇంగ్లండ్ చేతిలో ఓడగా... ఆసీస్‌ను భారత్ మట్టి కరిపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇంగ్లండ్, భారత్ తుదిపోరుకు అర్హత సాధించగా.. అఫ్గన్– ఆసీస్ మూడో స్థానం కోసం పోటీపడ్డాయి. నివేథన్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆసీస్ రెండు వికెట్ల తేడాతో విజేతగా నిలిచింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**